FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :188 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ శనివారం- 28 - ఫిబ్రవరి - 2026

# బొత్స త్వరగా కోలుకోవాలన్న పవన్ కల్యాణ్



**బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను**

**ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన**

**ఓ ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం**

అమరావతి : వైసీపీ మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. "శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. మిగతా..2లో

# బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి



**బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో పర్యటించిన కిషన్ రెడ్డి**

**బస్తీ వాసుల కష్టాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి**

**మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఆదేశం**

హైదరాబాద్ : సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈరోజు పర్యటించారు. గల్లీ గల్లీ తిరుగుతూ బస్తీ వాసుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీసి, నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించేందుకే మిగతా..2లో

## రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ



- ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోవడం లేదన్న బండి సంజయ్
- రైతు భరోసా నిధులపై మీ మాట మీరే విస్మరిస్తారా అని ప్రశ్న
- రైతు భరోసా నిధులు విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోవడం లేదని ఆ లేఖలో విమర్శించారు. ఎన్నికలకు ముందు హామీలివ్వడం, ఆ తర్వాత మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. రైతు భరోసా నిధులు ఇప్పటి వరకు జమ చేయలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు వేస్తామని మిర్యాలగూడ వేదికగా మిగతా..2లో

# సీఎం రేవంత్‌రెడ్డితో ముగిసిన మాజీ మావోయిస్టు నేతల భేటీ

- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మాజీ మావోయిస్టులు
- దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్న
- కీలక ప్రాధాన్యత సంతరించుకున్న సమావేశం



హైదరాబాద్: సచివాలయంలోని సీఎం రేవంత్ రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టు నేతల భేటీ ముగిసింది. సీఎం రేవంత్‌రెడ్డితో కీలక చర్చలు జరిపారు. పొలిటికల్ ఎజెండాపైన పలు రకాలుగా దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచీ ఐజీ సుమతి పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసిన మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు

- మర్యాదపూర్వకంగా సభాపతిని కలిసిన తెలంగాణ మంత్రులు
- మార్చి 5న జరగనున్న కుమారుడి వివాహానికి ఆహ్వానించిన భట్టివిక్రమార్క
- అంతకుముందు, కనకదుర్గమ్మను దర్శించుకున్న భట్టివిక్రమార్క



హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మిగతా..2లో

## ఏపీకి మరో భారీ పరిశ్రమ.. దేశంలోనే తొలి ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్



- ఏపీకి రానున్న దేశంలోనే తొలి అమోర్ఫస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్
- తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1350 కోట్ల పెట్టుబడి
- అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- 2026 అక్టోబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం లక్ష్యం
- ఈ ప్రాజెక్టుతో సుమారు 200 మందికి ప్రత్యక్ష ఉపాధి

## ఢిల్లీలో ఇప్పుడు ఎన్నికలు పెడితే బీజేపీకి 10 సీట్లు దాటితే రాజకీయాలు వదిలేస్తా'

- ఆప్ నేతలపై తప్పుడు కేసులు పెట్టారు- సీబీఐ విచారణ తీరును కోర్టు తప్పుపట్టింది
- కోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది
- కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ : ఢిల్లీ రాజకీయాల్లో మరోసారి వేడి పెరిగింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో కోర్టు నుంచి ఊరట లభించిన నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ పార్టీని రాజకీయంగా నశింపజేయాలనే ఉద్దేశంతోనే తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. అంతేకాదు, ఢిల్లీలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, అందులో భారతీయ జనతా పార్టీ 10 సీట్లకంటే ఎక్కువ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు.

### నిజాయతీపై మచ్చ వేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర

శుక్రవారం మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్, మద్యం విధానం కేసులో మిగతా..2లో

# దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

- ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయన్న మోదీ
- గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందన్న ప్రధాని



ఢిల్లీ : దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'వికసిత్ భారత్' కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోదీ పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా మిగతా..2లో

## రాష్ట్రానికి మరో కీలక కంపెనీ - తొలిదశలో 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి



- తొలిదశలో 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ
- తొలిదశలో ఏటా 30 వేల టన్నులు ఉత్పత్తి చేయనున్న ప్లాంట్
- ప్రొటీరియల్ సంస్థ ఛైర్మన్ శాన్ స్టాక్ తో ముఖాముఖి

అమరావతి : రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు కూటమి సర్కార్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామని ప్రకటించాయి.

# ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు క్లీన్‌చిట్...

- అప్రూవర్ వాంగ్మూలంపై మాత్రమే కేసు నమోదు చేయడాన్ని ఖండించిన న్యాయస్థానం...
- సీబీఐ దర్యాప్తుపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు...ప్రత్యక్ష ఆధారాలు లేవని స్పష్టం...
- లిక్కర్ కేసులో ఉన్న 23 మందిపై అభియోగాలు రద్దు...
- రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించరాదని కోర్టు హెచ్చరిక...
- సత్యమేవ జయతే" అంటూ ఎక్స్‌లో స్పందించిన కల్వకుంట్ల కవిత...






ఢిల్లీ,ఫిబ్రవరి 27 (ఆకాంక్ష): దేశ రాజకీయాలను కుదిపేసిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పూర్తి స్థాయి విముక్తి లభించింది. ఈ కేసును పూర్తిగా మూసివేస్తూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 23 మందిపై నమోదైన అభియోగాలను రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో దేశవ్యాప్తంగా ఈ తీర్పు రాజకీయంగా, న్యాయపరంగా విస్తృత చర్చకు దారి తీసింది. ఈ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనిష్ సిసోడియా, మాజీ ఎమ్మెల్సీ కవితతో పాటు పలువురు కీలక వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. అయితే కోర్టు తుది విచారణ అనంతరం అందరినీ డిశ్చార్జ్ చేస్తూ కేసును పూర్తిగా కొట్టివేసింది. ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేశారు. సీబీఐ దర్యాప్తులో ప్రాథమికంగా అవసరమైన ప్రత్యక్ష ఆధారాలు ఎక్కడా కనిపించలేదని, కేవలం అప్రూవర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి, అదే ఆధారంగా దర్యాప్తును కొనసాగించడం న్యాయసమ్మతం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసును విచారణ చేసిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) 23 మంది నిందితులపై నేరాన్ని నిరూపించే స్థాయిలో ఎటువంటి స్పష్టమైన ఆధారాలు సమర్పించలేక మిగతా..2లో



## ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ.. నారా లోకేశ్ చేతులమీదుగా శంకుస్థాపన



- రాంబిల్లి సెజ్‌లో బ్లూ జెట్ హెల్త్‌కేర్
- రూ.2,300 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ
- ఈ ప్రాజెక్టు ద్వారా 1,750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు
- మొత్తం 102.48 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికల్లో భాగంగా మరో భారీ పరిశ్రమ ఏర్పాటవుతోంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో మిగతా..2లో

## మొదటి పేజీ తరువాయి

## ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ..

# నారా లోకేశ్ చేతులమీదుగా శంకుస్థాపన

ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (బీజేహెచ్ఎల్) తన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.2,300 కోట్ల భారీ పెట్టుబడితో రానున్న ఈ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (ఫిబ్రవరి 28) శంకుస్థాపన చేయనున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న బ్లూ జెట్ హెల్త్‌కేర్, శాస్త్ర ఆధారిత ప్రత్యేక ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీలో జాతీయ స్థాయిలో మంచి పేరున్న సంస్థ. ఈ సంస్థ రాంబిల్లి సెజ్‌లో ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, జడ్.చింతువ రెవెన్యూ పరిధిలోని సీతపాలెం వద్ద 102.48 ఎకరాల భూమిని కేటాయించింది. ఎకరాకు రూ.40 లక్షల చొప్పున భూమిని కేటాయించడంతో పాటు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అదనపు ప్రోత్సాహకాలను కూడా మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సంస్థ మొత్తం రూ.2,300 కోట్ల పెట్టుబడిని దశల వారీగా పెట్టనుంది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1,750 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని బ్లూ జెట్ హెల్త్‌కేర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ పెట్టుబడి రాకతో స్థానిక పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. అంతేకాకుండా, ప్రధాన పరిశ్రమకు అనుబంధంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటై పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధునాతన ఫార్మాస్యూటికల్ తయారీ రంగంలో ఒక కీలక గమ్యస్థానంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ఏపీకి మరో భారీ పరిశ్రమ..

# దేశంలోనే తొలి ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్

అమరావతి : ఏపీ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. దేశంలోనే మొట్టమొదటి అమోర్ఫస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయనున్నారు. అమెరికా-జపాన్ దేశాలకు చెందిన ప్రొటీరియల్ అనే సంయుక్త సంస్థ ఈ ప్రాజెక్టును తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో స్థాపించనుంది. రూ.1350 కోట్ల భారీ పెట్టుబడితో 'మెట్‌గ్లాస్ ఇండియా' పేరుతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ స్టీల్ ప్లాంట్‌ను ప్రొటీరియల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అత్యాధునిక జపాన్ టెక్నాలజీని ఉపయోగించి అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలిదశలో ఏటా 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రొటీరియల్ సంస్థ సీఈవో శాన్‌స్టాక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లే తాము ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్టీల్ ప్లాంట్ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో స్పీకర్‌ను

# కలిసిన మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు

తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అయ్యన్నపాత్రుడిని కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహానికి రావాల్సిందిగా భట్టి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించుకున్నారు. కాగా, మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో భట్టివిక్రమార్క తనయుడి వివాహం జరగనుంది. అంతకుముందు, ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉదయం మల్లు భట్టివిక్రమార్క బెజవాడ కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం భట్టివిక్రమార్కకు పండితులు వేదాశీర్వచనం అందించారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

# రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

ఫిబ్రవరి 4న మీరే ప్రకటించారు, మీ మాటను మీరే విస్మరిస్తే ఎలా అని ముఖ్యమంత్రిని నిలదీశారు. లక్షలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్ల బకాయిలు ఇవ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. తక్షణమే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. నిధులు విడుదల చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పేదల ఇళ్లను కూల్చడంలో రేవంత్ రెడ్డి ఉత్సాహం చూపిస్తున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కేసీఆర్‌ను మించిపోయారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


# బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి

ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. నగరంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని, వర్షపు నీటి కాలువల్లో పూడిక తీయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పాలకవర్గం రద్దయిన నేపథ్యంలో, తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను

బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను“ అని తన ప్రకటనలో పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థపై దాడి





న్యాయవ్యవస్థపై దుమ్మెత్తి పోసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన దుందుడుకు ప్రయత్నం బెడిసికొట్టింది. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో ఋణ. ఈ వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు చేపట్టి కేంద్రానికి తలంటు పోసింది. నిన్న గురువారం విచారణ సందర్భంగా ధర్మాసనం దీని వెనుక 'లోతైన కుట్ర' ఉందని తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. చిరు ప్రాయంలోని విద్యార్థుల మెదళ్లలోకి ఇలాంటి అపోహలతో కూడిన తప్పుడు అభిప్రాయాలను ఎక్కించడం శుద్ధ తప్పని సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఉతికి ఆరేయడం గమనార్హం. కోర్టు కోపాగ్నిని చల్లార్చేందుకు ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. సొలిసిటర్ జనరల్ ద్వారా బేషరతు క్షమాపణలు చెప్పించింది. పుస్తకాల పంపిణీ ఆపేస్తామని హామీ ఇచ్చింది. అయినా కోర్టు శాంతించలేదు. ఆ పాఠమున్న పుస్తకాన్ని నిషేధించింది. ఏ రూపంలోనూ దానిని పంపిణీ చేయరాదని ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ ఆదేశాల అమలుపై నివేదిక సమర్పించాలని గడువు కూడా విధించింది. ఈ వ్యవహారాన్ని దేశం ముందుకు తేవడంలో మీడియా నిర్వహించిన పాత్రను ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేకంగా ప్రశంసించడం విశేషం. ఇదేదో కింది స్థాయి వ్యక్తులు యథాలాపంగా చేసిన మామూలు పొరపాటు కానేకాదు. ఇదంతా పైనున్న 'పెద్దల' ఆశీస్సులతో, వారి కనుసన్నల్లోనే జరిగిందనేది నూటికి నూరుపాళ్లు వాస్తవం. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను కేంద్ర పాలకులు ఇష్టారాజ్యంగా మారుస్తుండటం మొదటినుంచీ జరుగుతున్నది. పాఠ్యపుస్తకాల్లోని చరిత్రను తనకు నచ్చిన చట్రంలో ఇరికించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు గతంలో తీవ్ర విమర్శల పాలయ్యాయి. ఇప్పుడు న్యాయవ్యవస్థపై అవే పాఠ్యపుస్తకాలను ఉపయోగించుకోవడం విస్మయం కలిగిస్తున్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలను ఒకటొకటిగా అదుపులోకి తెచ్చుకునేందుకు తదేక దీక్షగా ప్రయత్నిస్తూనే ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను తన రాజకీయ అవసరాలకు వాడుకోవడంలో ఆరితేరింది. ఎన్నికల సంఘాన్ని తన జేబుసంస్థగా మార్చుకొని ఆడిస్తున్నది. ఈ తరహా సొంత ఎజెండాలో భాగంగానే న్యాయవ్యవస్థపై నిరంతరం దాడి చేస్తున్నది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వంటి బీజేపీ కీలక నేతలు అప్పుడప్పుడు న్యాయవ్యవస్థపై కంటగింపు వ్యాఖ్యలు చేయడం చూస్తున్నాం. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడుతూ వస్తున్న కొలీజియం వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని కేంద్రం గతంలో స్కెచ్ వేసింది. న్యాయ నియామకాలను గుప్పిట్లో పెట్టుకునేందుకు 'కేంద్ర న్యాయ నియామకాల కమిషన్' (ఎన్‌జాక్) చట్టాన్ని తెచ్చింది. దానిని సర్వోన్నత న్యాయస్థానం రద్దుచేసి, రాజకీయ జోక్యాన్ని ఆమడదూరానికి తరమడంతో బీజేపీ దూకుడుకు కళ్లెం పడింది. ఆ అమీతుమీ తర్వాత కూడా బీజేపీ నేతలు వంకర మాటలు మానలేదు. సుప్రీంకోర్టు తన విశేష అధికారాలను 'ఆటంబాంబుల్లా' వినియోగించుకుంటున్నదని వ్యాఖ్యానించడం న్యాయవ్యవస్థ పట్ల వారి అయిష్టతను తేటపరుస్తున్నది. ఆధునిక ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే గీటురాయి. ఆ రాజ్యాంగం అమలు బాధ్యత కార్యనిర్వాహక వర్గానిది, అంటే ప్రభుత్వానిది. అది సరిగా అమలవుతున్నదో లేదో ముల్లుగర్రతో పొడిచి గుర్తు చేయడం న్యాయవ్యవస్థ గురుతర బాధ్యత. ఈ బాధ్యత విషయంలో అమెరికా సుప్రీంకోర్టు తన సత్తా చాటడం ఇటీవలే మనం చూశాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధిస్తున్న సుంకాలు చెల్లవని తీర్పు చెప్పి రాజ్యాంగబద్ధ పాలనకు అండగా నిలిచింది. అత్యంత శక్తిమంతుడనే ఒక అగ్రరాజ్యం సర్వాధినేతను న్యాయవ్యవస్థ ఎలా దారికి తెచ్చిందనేందుకు ఇదొక ప్రబలమైన ఉదాహరణ. పాలకులు న్యాయవ్యవస్థను అడ్డంకిగా చూడటం ప్రపంచ చరిత్రలో కొత్తకాదు. వారి నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాలకు న్యాయవ్యవస్థ ముకుతాడు వేస్తుంది మరి. అందువల్ల బలమైన, స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన న్యాయవ్యవస్థ భారత ప్రజాస్వామ్యానికి తప్పనిసరి అని చెప్పక తప్పదు.

# వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట - రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్

మొదటి పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేశారు. పంచసూత్రాల ద్వారా వ్యవసాయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నామని, కృత్రిమ మేధ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. రైతు ఆత్మహత్యలు జరక్కుండా చర్యలు చేపట్టామని చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయంలో సాంకేతికత ఉపయోగించి రైతులను లాభాలబాట పట్టించడం, రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి నీటి భద్రత కల్పించడంతో పాటు డిమాండ్ ఆధారంగా పంటలు వేయడం, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచసూత్రాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో రైతు భరోసా రూ.7500 మాత్రమే ఇచ్చారని, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.14 వేలకు పెంచిందని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రానికి 14 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జాతీయ జీడీపీలో 10



శాతం వాటా మన రాష్ట్రానిదే : “వైఎస్సార్సీపీ హయాంలో సాగురంగంలో తీవ్రంగా నష్టపోయాం. వ్యవసాయంలో జాతీయ జీడీపీలో 10 శాతం వాటా మన రాష్ట్రానిదే. పంచ సూత్రాలు, అగ్రిటెక్ ద్వారా వ్యవసాయాభివృద్ధికి చర్యలు. డిమాండ్ ఉన్న పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహిస్తే పంటలకు మంచి ధర వస్తుంది. ఉచిత విద్యుత్‌కు ఏటా రూ.13,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. భూసారం పెంచేందుకు సూక్ష్మ పోషకాలను రైతులకు పంపిణీ చేస్తున్నాం. రైతు భరోసా పేరుతో వైఎస్సార్సీపీ ప్రభుత్వం మిగతా ప్రోత్సాహకాలు ఆపేసింది. ధాన్యం రైతులకు రూ.10 వేల కోట్లకు పైగా ఇచ్చాం. మేం వచ్చాక రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించాం. ఎక్కడా రైతుల ఆత్మహత్యలు జరగకుండా చర్యలు చేపట్టాం. రైతుల ఆత్మహత్యకు కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తున్నాం. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నాం. సాగురంగంలో ఏఐ, ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నాం. 8 వేలకు పైగా గ్రామాల్లో 15 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారు. ప్రకృతి సేద్యం వైపు 40 లక్షల మందిని మళ్లించాలనేది మా లక్ష్యం. భూగర్భ జలాలు పెంచి నీటి నిర్వహణ సమర్థంగా చేపట్టాలి. రైతులు కూడా ప్రభుత్వ విధానాలు అర్థం చేసుకోవాలి. కౌలురైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంట వేసి నష్టపోతున్నారు“ అని సీఎం చంద్రబాబు తెలిపారు. “వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నాం. రైతులకు ఆధునిక పరికరాలను పరిచయం ప్రోత్సహిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్‌పై అధిక దృష్టి పెట్టాం. ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరాలకు విస్తరిస్తాం. రాయలసీమలో 20 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు అవుతోంది. దేశంలోనే అత్యధిక పండ్లు పండే ప్రాంతంగా రాయలసీమ ఉంది. రాయలసీమలో హార్టికల్చర్‌ను 40 లక్షల ఎకరాలకు పెంచుతాం. రాయలసీమ హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఏలూరు దగ్గర అతిపెద్ద కోకో సిటీ వస్తుంది. ఏజెన్సీలో కాఫీ పంట విస్తీర్ణం పెరుగుతోంది. ఆక్వా ఉత్పత్తిలో దేశంలోనే తొలి స్థానంలో ఉన్నాం. అతిపెద్ద ఆక్వా కల్చర్ హబ్‌గా మన రాష్ట్రం తయారవుతుంది.

# రాష్ట్రానికి మరో కీలక కంపెనీ – తొలిదశలో 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి

ఇందులో కొన్ని కార్యరూపం దాల్చాయి. మరికొన్నింటికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ రోజు జపాన్ -అమెరికా సంయుక్త సంస్థ ప్రొటీరియల్ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించాయి. రాష్ట్రంలో మరో కీలక కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. తిరుపతి శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటీరియల్ ప్రకటించింది. మెట్ గ్లాస్ ఇండియా పేరుతో కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రొటీరియల్ సంస్థ ప్రతినిధులు దిల్లీలో వెల్లడించారు. ఈ సంస్థ అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేయనుంది. రాష్ట్రానికి రానున్న మరో కీలక కంపెనీ – శ్రీసిటీలో ఎలక్ట్రికల్ స్టీల్ కర్మాగారం ఏర్పాటు తొలిదశలో సుమారు 77 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. 200 మందికి నేరుగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ ఏడాది 2026 అక్టోబర్ నుంచి కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు సంస్థ ఛైర్మన్ శాన్ స్టాక్ తెలిపారు. అధునాతన జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్లాంట్ లో ఉపయోగించనున్నట్లు చెప్పారు. తొలిదశలో ఏడాదికి 30 వేల టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ పని చేస్తుందని వివరించారు. ప్లాంట్‌లో పని చేసేందుకు స్థానిక యువతకు ఎక్కువ అవకాశం ఇస్తామని, ఇందుకు పలువురిని ఎంపిక చేసి వారికి జపాన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. “శ్రీసిటీలో స్టీల్ కర్మాగారం ఏర్పాటు చేయనున్నాం. మెట్ గ్లాస్ ఇండియా పేరుతో ఏర్పాటు చేస్తాం. అధునాతన జపాన్ టెక్నాలజీని వాడనున్నాం. అల్లాయ్ రిబ్బన్ ను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. తొలిదశలో ప్లాంట్ ఏటా 30 వేల టన్నులు ఉత్పత్తి చేయనుంది. అక్టోబర్ నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తాం.“ - శాన్ స్టాక్, ప్రొటీరియల్ సంస్థ ఛైర్మన్ దాదాపు 200 వందల మందికి తొలి దశలోనే ఉద్యోగాలు కల్పించడంతో పాటుగా వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగాలు కల్పించనున్నారు. తొలిదశలో 77 మిలియన్ డాలర్ల పెట్టుబడికి ఆంధ్రప్రదేశ్ మరోసారి వేదిక కానుంది. మరోవైపు గత ఏడాది తిరుపతి జిల్లా శ్రీ సిటీలో డైకిన్ మూడో ప్లాంట్ నిర్మాణంతో ఏడాదికి 50 లక్షల ఏసీలను ఉత్పత్తి చేయనున్నామని డైకిన్ సంస్థ దక్షిణ ప్రాంత వైస్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ కుటుంబరావు తెలిపారు. ఏపీలో ఇప్పటికే 2 ప్లాంట్లను ఏర్పాటు చేశారని, మూడోది ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో డైకిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. మూడో ప్లాంట్ నిర్మాణంలో భాగంగా రూ.2,500 వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నామని అన్నారు.రాష్ట్రంలో యువతకు 5 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మూడు ప్లాంట్లతో కలిపి ఏటా 50 లక్షల ఏసీలను




ఉత్పత్తి చేస్తామన్నారు. వీటిల్లో 15 నుంచి 20 లక్షల ఏసీలను విదేశాలకు ఎగుమతి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణనిచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటామని చెప్పారు. కొత్తగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. తడ చుట్టుపక్కల ఉన్న మహిళలకు తర్ఫీదు ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఉన్న నమ్మకం, కంపెనీలకు అందిస్తున్న ప్రోత్సాహకాలతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నామని నిమ్మగడ్డ కుటుంబరావు వెల్లడించారు.

# దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి

మొదటి పేజీ తరువాయి



సాకారం అవుతాయని వివరించారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకుపైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని పేర్కొన్నారు. మరోవైపు, బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు. “బడ్జెట్ గురించి చర్చించడం దీని ఉద్దేశం కాదు. వీలైనంత త్వరగా బడ్జెట్‌ను అమలు చేయడం, అది సులభమైన మార్గంలో చేయడం దీని ఉద్దేశం. వాటాదారులందరూ దీని నుంచి ప్రయోజనం పొందాలి. బడ్జెట్‌ను కేవలం స్వల్పకాలిక వ్యాపార పత్రంగా చూడకూడదు. అది ఒక విధానపరమైన మార్గదర్శి. బడ్జెట్ ప్రభావాన్ని పటిష్టమైన, వాస్తవిక పారామితులపై అంచనా వేయాలి. ఇలాంటి విధానాలు మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రుణ లభ్యతను మరింత సరళతరం చేయాలి. సులభతర వాణిజ్యాన్ని పెంచాలి. పాలనలో పారదర్శకత పెరగాలి. ప్రజల జీవనం మరింత సులభతరం కావాలి. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అత్యంత గొప్ప విషయం ఏమిటంటే ఏ బడ్జెట్‌ను కూడా వేరు చేసి చూడడానికి వీల్లేదు. దేశ నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. ప్రతీ బడ్జెట్ ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక అడుగు అవుతుంది. మన ముందు ఉన్న ఆ పెద్ద లక్ష్యం ఏమిటంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని. ప్రతీ సంస్కరణ, ప్రతీ మార్పు ఈ సుదీర్ఘ ప్రస్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేయాలి.“

**- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. “విదేశీ పెట్టుబడి చట్రాన్ని సులభతరం చేస్తున్నాం. పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడానికి మేం ప్రయత్నిస్తున్నాం. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్ మార్కెట్లను మరింత చురుగ్గా చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. బాండ్లను కొనుగోలు చేయడం, అమ్మడం వంటి ప్రక్రియను సులభతరం చేస్తున్నాం. దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే బాండ్ మార్కెట్ సంస్కరణలను మనం చూడాలి. స్థిరమైన విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి మనం సరికొత్త సాధనాలను తీసుకురావాలి. ప్రభుత్వం, పరిశ్రమ, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య ఉమ్మడి వెంచర్‌గా స్పష్టమైన సంస్కరణ భాగస్వామ్య చార్టర్ ను అభివృద్ధి చేయాలి“

**నరేంద్ర మోదీ, భారత ప్రధాని**

అదేవిధంగా పరిశ్రమలు నూతన ఉత్సాహంతో ముందుకు రావాలని ప్రధాని మోదీ కోరారు. 2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థల మధ్య సమన్వయం కోసం 'రిఫార్మ్ పార్ట్‌నర్‌షిప్ చార్టర్' రూపొందించాలని ప్రధాని ప్రతిపాదించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ పత్రం కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# దిల్లీలో ఇప్పుడు ఎన్నికలు పెడితే- బీజేపీకి 10 సీట్లు దాటితే రాజకీయాలు వదిలేస్తా‘

మొదటి పేజీ తరువాయి

తనతో పాటు ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, మరికొంతమందికి కోర్టు ఊరట ఇచ్చిందని తెలిపారు. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. “ఇది పూర్తిగా ఫేక్ కేసు. మా నిజాయతీపై మచ్చ వేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేసింది“ అంటూ కేజ్రీవాల్ మండిపడ్డారు.

### రాజకీయాల నుంచి తప్పుకుంటా!

తాను జీవితంలో సంపాదించుకున్నది ఒక్క నిజాయతీ, మంచి పేరు మాత్రమేనని, అదే లక్ష్యంగా చేసుకుని మోదీ, అమిత్ షా దాడి చేశారని ఆరోపించారు. “సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ఆయుధాలుగా ఉపయోగించి మమ్మల్ని జైలుకు పంపించారు. నా కుటుంబసభ్యులు కూడా చాలా ఇబ్బందులు పడ్డారు“ అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా ప్రధానికి సవాల్ విసిరారు. “దిల్లీలో మీకు అంత ప్రజాదరణ ఉంటే వెంటనే ఎన్నికలు పెట్టండి. బీజేపీకి 10 సీట్లు కూడా రావు. అంతకంటే ఎక్కువ వస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటాను“ అని స్పష్టం చేశారు.

### కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్న బీజేపీ

కేజ్రీవాల్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం దిల్లీ ప్రజల కోసం పాఠశాలలు, ఆస్పత్రులు, రోడ్లు నిర్మించిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామని, ఆరోగ్య రంగంలో మోహల్లా క్లినిక్స్ వంటి సేవలు అందించామని గుర్తుచేశారు. “మేం అభివృద్ధి రాజకీయాలు చేశాం. కానీ బీజేపీ మాత్రం కేసులు, కక్షసాధింపు రాజకీయాలు చేస్తోంది“ అని విమర్శించారు. దిల్లీలో కాలుష్యం, యమునా నది కాలుష్యం, దెబ్బతిన్న రోడ్లు వంటి సమస్యలపై కూడా ఆయన కేంద్రాన్ని నిలదీశారు. “మూడుకోట్ల మంది ప్రజలు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సింది పోయి మమ్మల్ని వేధిస్తున్నారు“ అని అన్నారు. ఇక కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరుపై కూడా కేజ్రీవాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీబీఐ విచారణలో లోపాలున్నాయని కోర్టే వ్యాఖ్యానించిందని చెప్పారు. ఇదే విషయంపై సీబీఐ పనితీరును ప్రశ్నించారు. అదేవిధంగా ఈడీ కేసుల్లోనూ ఊరట కోసం కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

### ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది: కేజ్రీవాల్


“దేశ ప్రజలకు మోదీ, అమిత్ షా క్షమాపణలు చెప్పాలి. ప్రజలు అధికారాన్ని అభివృద్ధి కోసం ఇచ్చారు గానీ, ప్రతీకార రాజకీయాల కోసం కాదు“ అని వ్యాఖ్యానించారు. తమ పార్టీ ఎప్పుడూ ప్రజల మేలు కోసం పనిచేస్తుందని, మాకంటే బాగా పనిచేయాలని బీజేపీని కోరుతున్నామని చెప్పారు. “ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది. ప్రజలు మా నిజాయతీని గుర్తిస్తారు. మేం దిల్లీ అభివృద్ధికే కట్టుబడి ఉంటాం“ అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

### కేసు ఏమిటంటే?

దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని, ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

# ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు క్లీన్‌చిట్...

పోయిందని కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. అప్రూవర్‌ను ఉపయోగించి దర్యాప్తు కొనసాగించడం, ఆ వాంగ్మూలం ఆధారంగా ఇతరులను నిందితులుగా చూపించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని కోర్టు తేల్చి చెప్పింది. న్యాయమూర్తి పేర్కొన్నట్లుగా, నిందితుడికి క్షమాభిక్ష ఇచ్చి అతన్ని అప్రూవర్‌గా మార్చి, అతని వాంగ్మూలం ఆధారంగా ఇతరులపై కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదని, ఇది న్యాయ వ్యవస్థ ప్రామాణికతను దెబ్బతీసే చర్యగా భావించాల్సినదని కోర్టు పేర్కొంది. ఇలాంటి వ్యవహారం కొనసాగితే రాజ్యాంగ విలువలు క్షీణిస్తాయని న్యాయమూర్తి తీవ్రంగా హెచ్చరించారు. అలాగే ఈ కేసు నమోదు ప్రక్రియపై కూడా కోర్టు విమర్శలు గుప్పించింది. 2022 జూలై 20న ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ కేసు నమోదు చేసింది. అయితే ఆ ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా దర్యాప్తు జరగలేదని, సాక్ష్యాధారాలు సేకరణలో లోపాలు ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. కోర్టు తన తీర్పులో సీబీఐ అధికారుల పనితీరుపై కూడా ప్రశ్నలు లేవనెత్తింది. సరైన ఆధారాలు లేకుండా కేసు నమోదు చేసి, విచారణ కొనసాగించడం అనుచితమని పేర్కొంటూ సంబంధిత అధికారులపై శాఖాపరమైన విచారణ చేపట్టాల్సిందిగా సూచించింది.తీర్పు వెలువడిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ కవిత తన స్పందనను వ్యక్తం చేశారు. తన ఎక్స్ ఖాతాలో “సత్యమేవ జయతే” అంటూ ఒకే వాక్యంతో స్పందిస్తూ న్యాయం గెలిచిందని భావోద్వేగంగా తెలియజేశారు. గతంలో తనపై వచ్చిన ఆరోపణలను రాజకీయ ప్రేరేపితమైనవిగా పేర్కొంటూ వచ్చిన కవితకు ఈ తీర్పు పెద్ద ఊరటనిచ్చింది. ఈ కేసు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పనలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీబీఐతో పాటు ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణలు చేపట్టాయి. పలువురు రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు ఈ కేసులో నిందితులుగా చేర్చబడ్డారు.అయితే కోర్టు తాజా తీర్పుతో ఆ ఆరోపణలకు చట్టపరమైన బలం లేదని స్పష్టం అయింది. సరైన సాక్ష్యాలు లేకుండా ఎవరిపైనా నేరారోపణలు చేయరాదనే న్యాయసూత్రాన్ని ఈ తీర్పు మరోసారి గుర్తు చేసింది.రాజకీయ వర్గాల్లో ఈ తీర్పుపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ నాయకులు



న్యాయం గెలిచిందని వ్యాఖ్యానిస్తుండగా, ప్రతిపక్షాలు దర్యాప్తు సంస్థల విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయినప్పటికీ కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయపరంగా కీలకమైన మైలురాయిగా భావిస్తున్నారు. న్యాయ నిపుణులు ఈ తీర్పును విశ్లేషిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ఇది నిదర్శనమని పేర్కొంటున్నారు. దర్యాప్తు సంస్థలు సరైన విధానాలను పాటించకపోతే కోర్టులు ఎలా జోక్యం చేసుకుంటాయో ఈ కేసు ఉదాహరణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో వచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చకు దారి తీస్తూనే ఉంది. మాజీ ఎమ్మెల్సీ కవితకు లభించిన ఈ క్లీన్‌చిట్ ఆమె రాజకీయ భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంపాదకీయం

## సమాఖ్య పాలనపై కొత్త సంవాదం

మన గణతంత్ర రాజ్యం ఇప్పుడు పలు క్లిష్ట పరిస్థితుల నెదుర్కొంటున్నది. పర్యావరణ సంక్షోభాలకు పరిష్కారాలు, సంప్రదాయ వృత్తి విద్యలకు కొత్త శక్తినివ్వడం, ప్రత్యామ్నాయ విద్య, సమర్థమైన ఆరోగ్య భద్రతా విధానాలు, స్మార్ట్ ఐటీ క్లస్టర్స్, వ్యాపారాలలో కొత్త పద్ధతులు మొదలైన విషయాలలో సమస్త భారతీయుల ఉమ్మడి భవిష్యత్తుకు ఉపయుక్తమైన కొత్త భావాలు, నమూనాలు, ప్రయోగాలు దక్షిణ భారతావని నుంచే ప్రభవిస్తున్నాయి. అలాగే రాజకీయ వ్యవహారాలపై అధునాతన చర్చలూ దక్షిణాదిలోనే ప్రారంభమవుతున్నాయి. భారతదేశ సమాఖ్య పాలనా పద్ధతిపై ప్రస్తుత పరిస్థితులలో చాలా అవసరమైన సంభాషణను తమిళనాడు ప్రారంభించింది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి గురించి ఎవరూ మాట్లాడని రోజులలో ఆ భావనను ప్రతిపాదించి, సమర్థించిన రాజమన్నార్ కమిటీ (196971) స్ఫూర్తితో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం గత ఏడాది కేంద్రంరాష్ట్రాల సంబంధాలపై ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన నియమితమైన త్రిసభ్య కమిటీ కొద్ది రోజుల క్రితమే ఒక నివేదికను సమర్పించింది. భారతదేశ సమాఖ్య పాలనా పద్ధతిపై శ్రద్ధాసక్తులు ఉన్నవారందరూ ఆ నివేదికను చదివి, చర్చించాల్సిన అవసరమున్నది. రాజమన్నార్ కమిటీ సూచనలను పునరుద్ఘాటించేందుకు లేదా వాటిని తాజాగా ప్రతిపాదించేందుకే ఈ నివేదిక పరిమితం కాలేదు. భారత రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య పాలనా పద్ధతిని మెరుగుపరిచేందుకు పలు నిర్దిష్టమైన ప్రతిపాదనలను ప్రజల పరిశీలనకు నివేదించింది. సరళంగా చెప్పాలంటే ఒక కొత్త సమాఖ్య ఒప్పందం లేదా భారత సమాఖ్యవాద నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణకు జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక విజ్ఞప్తి చేసింది. కేంద్రరాష్ట్ర సంబంధాల విషయమై మన రాజ్యాంగం నిర్దేశాలు కేంద్రీకరణవైపే ఎక్కువగా మొగ్గాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకలా జరిగింది? దేశ విభజన అల్లకల్లోల పరిస్థితులలో కొత్త స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అవస్థలు రాజ్యాంగ రచనకు పూనుకున్న మన నాయకులను అమితంగా కలవరపరిచాయి. తత్కారణంగానే కేంద్రానికి ఎక్కువ అధికారాలు కల్పించారు. నాటి అల్లకల్లోల పరిస్థితులు పూర్తిగా సమసిపోయినప్పటికీ అధికారాల కేంద్రీకరణ ఒక వారసత్వ అలవాటుగా మిగిలిపోయింది. ఇది కొత్త రాజకీయ పరిస్థితుల ఆధారంగా తీసుకున్న ఆలోచనాత్మక నిర్ణయం ఎంత మాత్రం కాదు. ఇది మన ప్రజాస్వామిక పాలనలో ఒక తిరోగమనం, సందేహం లేదు. 1990ల్లో ప్రాంతీయ పార్టీల ప్రాభవ ప్రాబల్యాలు, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఆ తిరోగమనాన్ని అడ్డుకోవడంలో విఫలమయ్యాయి. గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. కేంద్రంలోని ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా, తమ భావజాల స్ఫూర్తితో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగించడంతో కేంద్రరాష్ట్ర సంబంధాలలో ఇబ్బందికరమైన అసమతుల్యతలు నెలకొన్నాయి. ఆర్థిక వ్యవహారాలలో, పాలనాపరమైన విషయాలలో అధికారాల కేంద్రీకరణ మరింతగా పెరిగింది. రాష్ట్రాలను సమాన భాగస్వాములుగా కాకుండా మునిసిపాలిటీల స్థాయి పాలనా విభాగాలుగా పరిగణించే ధోరణులు పెరిగిపోయాయి. దేశ పాలనలో సమాఖ్య స్ఫూర్తి బాగా క్షీణించిపోయింది. 'తనలో భాగంగా ఉన్న రాష్ట్రాలను పూర్తిగా విశ్వసించే, వాటి సమ భాగస్వామ్యాన్ని గౌరవించే, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించే సమాఖ్య వ్యవస్థ దేశ సార్వభౌమత్వాన్ని బలహీనపరచదు; ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢమూ, విశాలమూ చేస్తుంది' అని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక పేర్కొంది. అటువంటి సమాఖ్య వ్యవస్థ సమైక్యంగా సుస్థిరంగా ఉండడమనేది 'ఆదేశించడం కాకుండా ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయాలు తీసుకోవడం వల్ల, భాష మొదలైన విషయాలలో ఆధిపత్యానికి ఆస్కారం లేకుండా సంప్రదింపులతో సర్దుబాట్లు చేసుకోవడం వల్ల, అధికారాల కేంద్రీకరణతో కాకుండా వాటి సూత్రబద్ధ పంపిణీతో సాధ్యమవుతుందని' జస్టిస్ కురియన్ నివేదిక పేర్కొంది. కేంద్రరాష్ట్ర సంబంధాలపై ఏ భావి సంభాషణ అయినా ఈ అవగాహనతోనే ప్రారంభమవ్వాలి. భారత సమాఖ్యవాదం పాలనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల శాసన, పాలనా అధికారాలలో జోక్యం చేసుకుంటోందని, ఆర్థిక రంగంలో కూడా అదే ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని జస్టిస్ కురియన్ నివేదిక వాదించింది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు వివిధ రంగాలలో సంస్కరణలు తక్షణావశ్యకమని అభిప్రాయపడింది. ముందుగా రాష్ట్రాల సరిహద్దులను మార్చడం అంటే రాష్ట్రాల ప్రాదేశిక పునర్వ్యవస్థీకరణలో కేంద్ర ప్రభుత్వ అధికారాలకు పరిమితి ఉండాలని, రాజ్యాంగాన్ని సవరించడంలో రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం నిర్ణయాలు తీసుకోకూడదని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఆర్థిక రంగంలో 1991 ఆర్థిక సంస్కరణలతో పోల్చదగిన స్థాయిలో కేంద్రరాష్ట్ర సంబంధాలలో సమతుల్యతను పునఃసాధించాలని జస్టిస్ కురియన్ కమిటీ నివేదిక కోరింది. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి మళ్లీ రాష్ట్ర జాబితాలో చేర్చాలని, రాష్ట్రాల అధికార పరిధిలోని ఆరోగ్య భద్రత, వ్యవసాయం తదితర రంగాలలో కేంద్ర ప్రభుత్వ చొరబాటును అడ్డుకోవాలని కూడా జస్టిస్ కురియన్ కమిటీ పేర్కొంది. రాజకీయ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి గవర్నర్లు తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో పక్షపాత వైఖరితో నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకునేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు చేపట్టాలని సూచించింది.

# కంటైనర్ల కొరత తీరేదెలా?

సత్వర, సుస్థిర ఆర్థిక ప్రగతికి తయారీ రంగం అత్యంత కీలకం. ప్రస్తుతం దేశ జీడీపీలో తయారీ రంగం వాటా 17శాతం. దీన్ని 25శాతానికి పెంచేందుకు ఉత్పత్తిని జోరెత్తించడమే కాకుండా... పారిశ్రామిక, సరకు రవాణా కారిడార్లనూ విస్తరించాలని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ లక్షిస్తోంది. ఆ గమ్యాన్ని చేరుకోవడంతోపాటు సరకును సురక్షితంగా రవాణా చేయడానికి తగినంత సంఖ్యలో కంటైనర్లు అవసరం. వాటి ఉత్పత్తిలో వెనకబాటుతనం వల్ల భారతదేశానికి రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. దేశంలో కంటైనర్ల ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. వాటికి డిమాండ్ ఏమో చాలా ఎక్కువగా ఉంటోంది. దానివల్ల సరకు రవాణాకు కంటైనర్ల కొరత తప్పడంలేదు. దీంతో ఓవైపు వ్యయం పెరుగుతుంటే, మరోవైపు రవాణాలో జాప్యం కారణంగా సరకుకు డిమాండ్ తగ్గిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం 2015లో 'సాగరమాల' పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పోర్టు ఆధారిత వర్తకాన్ని త్వరితంగా, తక్కువ వ్యయంతో నిర్వహించడం వీలవుతోంది. నేడు దేశంలో విలువపరంగా దాదాపు 70శాతం విదేశీ వాణిజ్యం సముద్ర రవాణా ద్వారానే జరుగుతోంది. దానికి అత్యావశ్యకమైన కంటైనర్ల తయారీని పెంచితే, దేశీయ వర్తకంలో విప్లవాత్మక ముందడుగు పడుతుంది. ముఖ్యంగా సరకు ఉత్పత్తి, రవాణా వ్యయాలు బాగా తగ్గుతాయి. 2024 నాటి జల రవాణాశాఖ గణాంకాల ప్రకారం, దేశంలో మూడు లక్షలకు పైగా కంటైనర్ల అవసరముంది. కానీ, మన దగ్గర ఏటా తయారవుతున్నది పదివేల నుంచి ముప్పైవేల కంటైనర్లే! చైనా అయితే ఏటా సుమారు 30లక్షల కంటైనర్లను ఉత్పత్తి చేస్తోంది. ఆ దేశం నుంచే మనం ఎక్కువగా వాటిని అద్దెకు తీసుకుని సరకు రవాణాకు వాడుకుంటున్నాం. దాంతో లాజిస్టిక్స్ వ్యయం పెరిగి, ఎగుమతుల్లో వెనకబడిపోతున్నాం.



### చైనా పోటీని తట్టుకోవాలంటే...

ప్రభుత్వ రంగంలోని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'మినీ రత్న' హోదా కలిగిన సంస్థ. ఇది బహుళవిధ లాజిస్టిక్స్ సేవలను అందిస్తుంది. ప్రధానంగా కంటైనర్లను ఉత్పత్తి చేయడం ద్వారా వాణిజ్య వికాసానికి తనవంతుగా దోహదపడుతోంది. భారత్‌లో తయారీలో భాగంగా నిరుడు ఈ సంస్థ మూడు వేల కొత్త కంటైనర్లను తయారు చేసింది. 56వేల కంటైనర్ల ఉత్పత్తి లక్ష్యాన్ని ఇటీవలే చేరుకుంది. కానీ, మన దేశంలో ఒక కంటైనర్ తయారీకి సుమారు 4800 డాలర్ల వరకు ఖర్చవుతోంది. చైనాలోనైతే అది 3500 డాలర్లలోపే ఉంటోంది. దాంతో మనం చైనా వంటి తక్కువ ఖర్చుతో ఎగుమతులు చేపట్టే దేశాలతో పోటీ పడలేకపోతున్నాం. భారీ కంటైనర్ నౌకల రాకపోకల కోసమని కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో వాధ్వాన్ పోర్టు అభివృద్ధిని చేపట్టింది. ఇక్కడ 2.30లక్షల డెడ్ వాటర్ టన్నేజ్ సామర్థ్యంతో బహుళార్థసాధక కార్గో బెర్తుల ద్వారా సరకును నిర్వహిస్తారు. 'ఇండియా- పశ్చిమాసియా-ఐరోపా ఆర్థిక నడవా(ఐమెక్)'లో భాగంగా ఈ ఓడరేవు నిర్మాణం చేపట్టారు. అంతర్జాతీయ వాణిజ్యానికి 'ఐమెక్' మరింతగా మార్గం సుగమం చేస్తుంది. చైనా నుంచి పోటీని తట్టుకోవడానికీ, ఆ దేశం చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు'కూ ఐమెక్ ప్రత్యామ్నాయం కాగలదు. పైగా ఈ మార్గంలో రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, సరకును త్వరగా గమ్యస్థానాలకు చేరవేసే వీలుంటుంది. ఇది దేశీయ కంటైనర్ రంగానికి పెద్ద ఊతమిస్తుంది కానీ, వాటి ఉత్పత్తిని త్వరితగతిన, పెద్దయెత్తున చేపట్టాల్సి ఉంది. ఎందుకంటే, పోర్టుల ద్వారా ఎగుమతి, దిగుమతుల నిర్వహణకు వేల సంఖ్యలో సాధారణ, ప్రత్యేక కంటైనర్లు కావాలి. గతంలో మన మొత్తం లాజిస్టిక్స్ వ్యయం జీడీపీలో 13-14శాతంగా ఉండేది. పీఎం గతిశక్తి, ఫాస్టాగ్, ఈ-వే బిల్లులు తదితరాల వల్ల 2023-24లో అది ఎనిమిది శాతానికి తగ్గింది. అయితే, సరకు రవాణాకు గిరాకీ ఏడాదికి ఏడెనిమిది శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. కాబట్టి, ఉన్న సదుపాయాలను సమర్థంగా ఉపయోగించుకుంటూ, అవసరమైన కొత్త వనరులను వేగంగా సమకూర్చుకోకపోతే లాజిస్టిక్స్ వ్యయం మళ్లీ అధికం కావచ్చు. ఈ నేపథ్యంలో కేంద్రం ఈసారి బడ్జెట్‌లో కంటైనర్ల తయారీకి అయిదేళ్ల కాలానికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించింది. అయితే పారిశ్రామిక ప్రగతి, ఎగుమతి లక్ష్యాలను అందుకునేలా కంటైనర్ల ఉత్పత్తి చేపట్టడానికి ఈ నిధులు సరిపోవు. పైగా ఇటీవలి కాలంలో భారత్ అనేక దేశాలు, కూటములతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోంది. వాటి మూలంగా భారతదేశ ఎగుమతి రంగం మరింతగా జోరందుకోనుంది. ఈ అవకాశాలను సమర్థంగా అందిపుచ్చుకోవాలంటే కంటైనర్ల కొరతను తప్పించాలి. సమీప భవిష్యత్తులో హైస్పీడ్ రైలు మార్గాలను ఏర్పాటుచేసి, సరకు సత్వర రవాణాకు వీలుకల్పించడమూ ముఖ్యమే!

### సాధికారత సాధించాలంటే...

పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో కంటైనర్ల తయారీని వేగిరపరచడం తక్షణావసరం. దాంతోపాటు ప్రైవేటు రంగంలో వాటి తయారీని ప్రోత్సహించేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, రాయితీలను అందించాలి. కంటైనర్ల తయారీకి కావాల్సిన ముడిసరకును తక్కువ ధరకు అందించడంపైనా దృష్టి పెట్టాలి. సాంప్రదాయక కంటైనర్లతో పాటు చేపలు, రొయ్యల వంటి సరకుల నాణ్యత క్షీణించకుండా చూసేందుకు కోల్డ్ స్టోరేజ్ కంటైనర్ల ఉత్పత్తినీ చేపట్టాలి. ఈ విషయంలో జపాన్, కొరియా వంటి దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. షిప్పింగ్, కంటైనర్ తయారీ సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం ఉభయతారకంగా ఉంటుంది. ఇటువంటి చర్యలతో పాటు, కంటైనర్ల లీజు రేట్లు తగ్గించేలా చైనాతో మాటామంతీ జరపాలి. కంటైనర్ల లభ్యత గురించి మాత్రమే కాకుండా- ఏ సమయంలో ఎక్కడ వాటి అవసరముందో తెలిసేలా ఏకీకృత లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్, లాజిస్టిక్స్ డేటాబేస్‌లను నిర్వహించాలి. కృత్రిమ మేధ, జీపీఎస్ వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా కంటైనర్ల వినియోగాన్ని ఎప్పటికప్పుడు గమనించవచ్చు. మొత్తంగా సంఖ్యాపరంగానే కాకుండా, అత్యాధునిక కంటైనర్ల తయారీలోనూ భారత్ సాధికారత సాధించడం- స్వావలంబన సాధనకు అత్యావశ్యకం!

# విప్లవం నుంచి వ్యవస్థలోకి.. మావోయిస్టు ఉద్యమం కొత్త మలుపు

ఇటీవల తెలంగాణ డీజీపీ ఎదుట అగ్రనేతలైన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డిలు లొంగిపోవడం సాధారణ ఘటన కాదు.. ఇది కేవలం వ్యక్తుల నిర్ణయం కాదు. ఒక సిద్ధాంత ప్రయాణం అలసటకు గురైన సంకేతం. దశాబ్దాలుగా అరణ్యాలలో గడిపిన నాయకత్వం ఇప్పుడు ప్రధాన ప్రవాహంలోకి రావడం చరిత్రాత్మక పరిణామం.. లొంగిపోయిన నేతలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు, పునరావాస పథకాలు.. ఇవి 'బుల్లెట్‌కు బదులు బ్యాలెట్' అనే ప్రజాస్వామ్య ఆహ్వానానికి సంకేతాలు.. మావోయిస్టు ఉద్యమం పూర్తిగా అంతరించిపోతుందా? లేక ఇది కొత్త రూపంలో మార్పు చెందుతుందా? అనే ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి.



### మూలాలను ఛేదించిన బలగాలు..

ఒక విషయం స్పష్టం, దశాబ్దాలుగా కొనసాగిన సాయుధ పోరాటం ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోసే దిశగా ముందుకు సాగలేకపోయింది. అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, రహదారులు.. ఇవి అటవీ ప్రాంతాల్లో చేరడం ప్రారంభమవడంతో ప్రజల ఆశలు మారుతున్నాయి. దశాబ్దాలుగా దేశ అంతర్గత భద్రతకు సవాలుగా నిలిచిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఒకప్పుడు విప్లవ భావజాలానికి అభేద్య కోటగా పేరుగాంచిన దండకారణ్యం, బస్తర్ అటవీ ప్రాంతాలు నేడు భద్రతా దళాల పటిష్ట ఆపరేషన్లకు వేదిక అవు తున్నాయి. ముఖ్యంగా 'ఆపరేషన్ కగార్' రూపంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర వ్యూహం ఉద్యమాన్ని మూలాల వరకు కుదించే ప్రయత్నంగా కనిపిస్తోంది.

### దశాబ్దాల దార్శనిక ప్రయాణం..

భూసంస్కరణల లోపం, గిరిజనుల నిర్లక్ష్యం, వనరుల దోపిడీ, సామాజిక అసమానతలు... ఇలాంటి అంశాలు మావోయిస్టు సిద్ధాంతానికి నేలవేసిన వాస్తవాలు.. 1967లో నక్సల్బరీ ఘటనతో మొదలైన ఈ దార్శనిక ప్రయాణం, తర్వాత వివిధ దశల్లో మార్పులు చెంది, చివరకు 2004లో (మీఘీశీఱర్)గా ఐక్యరూపం దాల్చింది. దండకారణ్యాన్ని కేంద్రంగా చేసుకుని, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో పార్టీ ప్రభావాన్ని విస్తరించింది.

### హింసాత్మక చర్యలు రేపిన ప్రశ్నలు..

ఉద్యమం తొలి దశలో 'వర్గపోరాటం' అనే సిద్ధాంతంతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించింది. అయితే కాల క్రమేణా హింస, మౌలిక వసతుల ధ్వంసం, ప్రజాప్రతి నిధుల హత్యలు.. ఇవన్నీ సామాన్య ప్రజల్లో భయాన్ని పెంచాయి. విప్లవం పేరుతో జరిగిన హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తాయి. గత కొన్ని సంవత్సరాలుగా కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో మావోయిస్టులపై బహుముఖ దాడులు ప్రారంభమయ్యాయి. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ బలోపేతం, డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రోడ్డు, సంవాహన సదుపాయాల విస్తరణ వంటి వాటితో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి.

### అలసిన సిద్ధాంత ప్రయాణం..

'ఆపరేషన్ కగార్' ఈ వ్యూహంలో కీలక ఘట్టం. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా భద్రతా బలగాలు జరుపుతున్న క్రమబద్ధమైన దాడులు అగ్రనాయకత్వాన్ని లక్ష్యంగా చేసు కున్నాయి. అత్యంత కీలక నేతల మరణం, అరెస్టులు, వరుస లొంగుబాట్లు... ఇవి ఉద్యమాన్ని కకావికలం చేశాయి. అగ్రశ్రేణి నాయకత్వం కోల్పోవడం వల్ల పార్టీకి వ్యూహాత్మక దిశ కనిపించలేదని స్పష్టమవుతోంది. ఇటీవల తెలంగాణ డీజీపీ ఎదుట అగ్రనేతలైన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డిలు లొంగిపోవడం సాధారణ ఘటన కాదు. ఇది కేవలం వ్యక్తుల నిర్ణయం కాదు.. ఒక సిద్ధాంత ప్రయాణం అలసటకు గురైన సంకేతం. దశాబ్దాలుగా అరణ్యాలలో గడిపిన నాయకత్వం ఇప్పుడు ప్రధాన ప్రవాహంలోకి రావడం చరిత్రాత్మక పరిణామం.

### శాంతియుత మార్గానికి గుర్తింపు!

లొంగిపోయిన నేతలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు, పునరావాస పథకాలు.. ఇవి 'బుల్లెట్‌కు బదులు బ్యాలెట్' అనే ప్రజాస్వామ్య ఆహ్వానానికి సంకేతాలు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిపై ₹25 లక్షలు చొప్పున, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డిపై ₹20 లక్షలు చొప్పున ప్రకటించిన మొత్తాలు కేవలం బహుమతులు మాత్రమే కాదు.. హింసాత్మక మార్గం విడిచిపెట్టి సామాన్య జీవితంలోకి అడుగుపెట్టే అవకాశానికి గుర్తింపు. అయితే మావోయిస్టు ఉద్యమం పూర్తిగా అంతరించిపోతుందా? లేక ఇది కొత్త రూపంలో మార్పు చెందుతుందా? అనే ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. అయితే ఒక విషయం స్పష్టం, దశాబ్దాలుగా కొనసాగిన సాయుధ పోరాటం ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోసే దిశగా ముందుకు సాగలేకపోయింది. అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, రహదారులు.. ఇవి అటవీ ప్రాంతాల్లో చేరడం ప్రారంభ మవడంతో ప్రజల ఆశలు మారుతున్నాయి.

### అసమానతలు తొలిగితే కదా..

విప్లవ భావజాలం పుట్టుకకు కారణమైన అసమానతలు పూర్తిగా తొలగిపోయాయని చెప్పలేం.. కానీ వాటి పరిష్కారం కోసం ఆయుధాలు కాదు, రాజ్యాంగబద్ధమైన మార్గాలే సమాధానమని తాజా పరిణామాలు సూచి స్తున్నాయి. దండకారణ్యాన్ని శాసించిన ఉద్యమం ఇప్పుడు చరిత్ర పుటల్లోకి జారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒక దశ ముగుస్తోంది. కానీ ఇది కేవలం భద్రతా విజయగాథగా మిగలకూడదు.. అసమానతలను తగ్గించే సార్థక అభివృద్ధి, అట్టడుగు వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడే విధానాలు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం.. ఇవి బలోపేతం అయితేనే శాశ్వత శాంతి సాధ్యం. దశాబ్దాల పోరాటానికి ఇది ముగింపు దశ కావచ్చు. అయితే సమగ్ర న్యాయం, సమాన అభివృద్ధి సాధించగలిగితేనే ఈ ముగింపు చరిత్రలో శాంతి అధ్యాయంగా నిలుస్తుంది.

# దేవభూమి ఇక 'కేరళం'

గులాబీ పువ్వును ఏ పేరుతో పిలిస్తేనేం గుబాళింపు మారదు కదా అంటాడు షేక్స్పియర్. కానీ పేరు మీద గుంజాటన అంత సులభంగా పక్కన పెట్టే విషయమేమీ కాదని చరిత్ర రుజువు చేసింది. దేవుడి సొంత గడ్డగా పేరొందిన కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చడం దీనికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నది. సున్నాయేగా మారింది అనుకుంటే సరిపోదు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ మార్పు చోటుచేసుకోవడం వెనుక భాష, చరిత్ర, అస్తిత్వంతో అల్లుకున్న రాజకీయాలున్నాయి. ప్రజల ఆకాంక్ష మేరకు కేరళ శాసనసభ 'కేరళం' తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించగా, వామపక్ష ప్రభుత్వం దానిని కేంద్రానికి పంపింది. ఇది జరిగింది 2024 జూన్ 24న. అంతకుముందు 2023లోనూ ఇలాంటి తీర్మానమే పంపితే అతీగతీ లేకుండా పోయింది. ఇప్పుడు ఏడాదిన్నర తర్వాత కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ హఠాత్తుగా ఈ తీర్మానం దుమ్ము దులిపింది. క్యాబినెట్‌లో పెట్టి మెరుపువేగంతో ఆమోదింపజేసింది. ఇక పార్లమెంటులో రాజ్యాంగ సవరణ జరుగడమే తరువాయి. పేరు మార్పిడి రాజకీయాలకు పెట్టింది పేరైన బీజేపీ ఎన్నికల సమయాన్ని ఇందుకు ఎంచుకోవడం గమనార్హం. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ మధ్యనే అధికారం బంతాట సాగే ఈ దక్షిణాది రాష్ట్రంలో కాలు మోపాలని బీజేపీ నానా తంటాలు పడుతున్నది. కేరళ అస్తిత్వంతో ముడివడి ఉన్న అంశంలో సానుకూల స్పందన ద్వారా బయటి పార్టీ అన్న ముద్రను చెరిపేసుకోవాలనేదే బీజేపీ అవకాశవాద తాపత్రయం. బెంగాల్‌ను తూర్పు, పశ్చిమంగా బ్రిటిష్‌వారు విభజించిన సంగతి తెలిసిందే. దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని ఈ విభజన మలుపు తిప్పింది. అయితే రెండు ముక్కలు భారత్‌లో ఉన్నప్పుడు ఈ దిక్కుల తోకలు ఉన్నాయంటే ఏమో అనుకోవచ్చు. కానీ, తూర్పు బెంగాల్ దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌లో లీనమై, ఇప్పుడు బంగ్లాదేశ్‌గా మనుగడ సాగిస్తున్నది. దేశంలో ఒకే రాష్ట్రం మిగిలినప్పుడు ఇంకా పశ్చిమ ఎందుకనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఫైర్ బ్రాండ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రం పేరును బాంగ్లాగా మార్చాలని చాలాకాలం నుంచి అంటున్నారు. కేరళం ఆమోదం పొందిన నేపథ్యంలో మరోసారి వంగభూమి పేరు మార్పిడిపై చర్చ మొదలైంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ అనేకసార్లు పేరు మార్పిడిపై తీర్మానాలు చేసి కేంద్రానికి పంపింది. వాటిల్లో రాష్ట్రం పేరును పశ్చిమ బంగ లేద బాంగ్లాగా మార్చాలని సూచించారు. చివరి తీర్మానం 2018లో వెళ్లింది. అయినా కేంద్రం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ఉలుకూ పలుకూ లేదు. కేరళ విషయంలో ఒకలాగా, బెంగాల్ విషయంలో మరోలాగా కేంద్రం అనుసరిస్తున్న రెండు నాల్కల ధోరణికి ఇది నిదర్శనం. మన దేశంలో అయితే పేర్ల మీద, విగ్రహాల మీద వివాదాలు కోకొల్లలుగా పుట్టుకు వస్తుంటాయి. అందుకు వలసపాలన కొంతవరకు కారణం. బ్రిటిష్ పాలన అంతరించాక కూడా ఆ కాలంనాటి విగ్రహాలు ఉంచాలా? ఇంగ్లిష్ భాష కారణంగా అపభ్రంశం పొందిన పేర్లను తిరిగి మనవైన రీతిలో మార్చుకోవాలి కదా? ఈ తరహా ఆలోచనలు ఇటీవలి కాలంలో మరీ ఎక్కువయ్యాయి. మద్రాస్ చెన్నై అయ్యింది. బొంబాయి ముంబైగా మారింది. విక్టోరియా టర్మినస్ (వీటీ).. ఛత్రపతి శివాజీ టర్మినస్ (సీఎస్టీ)గా మారింది. ఈ పేర్ల మార్పిడి అనేది బీజేపీ హయాంలో వెర్రితలలు వేస్తున్నది. ఢిల్లీలో రాజవీధుల పేర్లను ఎడాపెడా మారుస్తూపోయిన బీజేపీ ఈ మధ్య విగ్రహాలపై కూడా పడింది. ఢిల్లీ నగర రూపశిల్పి ఎడ్వర్డ్ ల్యూటెన్స్ విగ్రహాన్ని రాష్ట్రపతి భవన్ ఆవరణలో నుంచి తొలగించి ఆ స్థానంలో భారతీయ ప్రథమ గవర్నర్ జనరల్ రాజాజీ విగ్రహాన్ని పెట్టడం విమర్శల పాలైంది. ల్యూటెన్స్ ఓ ఆర్కిటెక్ట్. ఆయన వైస్రాయి కాదు కదా అని ఆయన మునిమనుమడు ఆవేదన వ్యక్తం చేశారు. అస్తిత్వంతో ముడివడిన సందర్భాల్లో పేరు మార్పిడిని (లేదా విగ్రహాల తొలగింపును) ఆమోదించవచ్చు. కానీ అనవసర వివాదాలతో పేర్లపై రాజకీయం చేయడం దేశానికి ఏ రకంగానూ ఉపయోగకరం కాదు. ఎందుకంటే పేరును మారిస్తే చరిత్ర చెరిగిపోదు.



# ఆధార్ కార్డు వినియోగదారులకు కేంద్రం భారీ గుడ్‌న్యూస్.. త్వరలో కొత్త సేవలు.. ప్రారంభం ఎప్పుడంటే..





ఆధార్ సేవలను మరింత సులభతరంగా ప్రజలు ఉపయోగించే ఏర్పాట్లు యూఐడీఏఐ చేస్తోంది. అందలో భాగంగా త్వరలో మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి ఆధార్ సేవా కేంద్రాలను ప్రజలు సులువుగా గుర్తించి సేవలు పొందేలా గూగుల్ సంస్థతో యూఐడీఏఐ భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారతదేశంలో నివసించే ప్రతీ వ్యక్తికి ముఖ్యమైన డాక్యుమెంట్ ఆధార్ కార్డ్. ఇది లేనిది మీరు భారత్‌లో ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు పొందలేరు. ప్రభుత్వ పథకాలు పొందటం దగ్గర నుంచి హోటల్‌లో చెకింగ్ వరకు ప్రతీ పనికి ఓ గుర్తింపు ధృవీకరణ పత్రంగా ఇది ఉపయోగపడుతుంది. దీంతో ప్రతీఒక్కరూ నిరంతరం ఎప్పుడూ తమ వెంట ఆధార్‌ను తప్పనిసరిగా ఉంచుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే ఎప్పుడు ఏ అవసరం పడుతుందో తెలియదు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆధార్ సేవలను ప్రజలకు సులువుగా అందించేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(UIDAI) ఎప్పటికప్పుడు కొత్త సౌకర్యాలు అందుబాటులోకి తెస్తుంది. అందులో భాగంగా ఇప్పుడు ఆధార్ వినియోగదారులకు ఉపయోగపడేలా మరో సదుపాయం ప్రవేశపెట్టింది. గూగుల్ మ్యాప్స్‌లో ఆధార్ సేవా కేంద్రాలు కొత్త ఆధార్ కార్డ్ తీసుకోవాలన్నా లేదా ఏవైనా వివరాలు అప్‌డేట్ చేసుకోవాలన్నా సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు సులువుగా గుర్తించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న వెరిఫైడ్ ఆధార్ సేవా కేంద్రాలను గూగుల్ మ్యాప్స్‌లో పొందుపర్చనుంది. ప్రస్తుతం ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేసుకునే యజమానులు గూగుల్ మ్యాప్స్‌లో తమ వివరాలను పొందుపర్చడం లేదు. ఇక కొంతమంది తప్పుగా వివరాలను ఇస్తున్నారు. దీని వల్ల లొకేషన్స్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది. దీనిని పరిష్కరించి ఆధార్ సేవలను వినియోగదారులు సుభతరంగా పొందేలా చేసేందుకు గూగుల్‌తో ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, యూఐడీఏఐ జత కట్టాయి. ఇందులో భాగంగా దేశంలోని ప్రతీ ఆధార్ సేవా సెంటర్‌ను గూగుల్ మ్యాప్స్‌లో రిజిస్టర్ చేయనున్నారు.

**లొకేషన్ మాత్రమే కాదు..**

కేవలం లొకేషన్ మాత్రమే కాకుండా ఆధార్ సెంటర్‌లో అందించే సేవలను కూడా ప్రజలు చూసుకోవచ్చు. పిల్లల ఆధార్ సేవలు, పెద్దల ఆధార్ సేవలు, మొబైల్ నెంబర్ అప్డేట్, చిరునామా అప్ డేట్ వంటి సేవలు అందిస్తున్నారా.. లేదా అనే సమాచారం మొత్తం రియల్ టైమ్‌లో తెలుసుకోవచ్చు. తమ సేవ అవసరానికి అనుగుణంగా ఏ కేంద్రంలో సేవలు దొరుకుతాయా ముందుగా తెలుసుకుని వెళ్లవచ్చు. ఇక సేవా కేంద్రాల టైమింగ్స్, పార్కింగ్ సౌకర్యాలు దివ్యాంగులకు వీల్ చైర్లు వంటి సదుపాయాల గురించి తెలుసుకోవచ్చు. ఇక రానున్న రోజుల్లో ఆధార్ సెంటర్లను విజిట్ చేసేందుకు ముందుగానే అపాయింట్మెంట్ బుక్ చేసుకునేలా గూగుల్ మ్యాప్స్‌లో అవకాశం కల్పించనుంది. దీని వల్ల ఇంటి వద్ద నుంచే అపాయింట్‌మెంట్ బుక్ చేసుకుని ఆ సమయానికి విజిట్ చేయవచ్చు. దీని వల్ల క్యూలైన్లలో నిల్చోవాల్సిన పని తప్పుతుంది.

# దేశం గర్వించదగ్గ విషయం.. 2027 నాటికి భారత్ ఆర్థిక వృద్ధి అంచనా ఎంతో తెలుసా




EY ఎకానమీ వాచ్ నివేదిక 2027 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 6.8 నుంచి 7.2 శాతం వృద్ధిని అంచనా వేసింది. ప్రభుత్వ విధానాలు, నిర్మాణాత్మక సంస్కరణలు, వాణిజ్య విస్తరణ ఈ పురోగతికి ప్రధాన చోదకాలు. ఇది ఉపాధిని, మార్కెట్ ద్రవ్యతను పెంచుతుంది. రాబోయే సంవత్సరాల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థకు శక్తివంతమైన ఊపు రానుందని ప్రముఖ ఆర్థిక సలహా సంస్థ జ్ ఎకానమీ వాచ్ తాజా నివేదిక వెల్లడించింది. 2027 ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్య ఉండొచ్చని అంచనా వేయడంతో మార్కెట్ వర్గాల్లో ఆశావహ వాతావరణం నెలకొంది. ఈ వేగవంతమైన వృద్ధి ఉపాధి అవకాశాల పెరుగుదలతో పాటు మార్కెట్లో ద్రవ్యత మెరుగుపడే సూచనగా నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన విధాన చర్యలు, మధ్యకాలిక ఆర్థిక అవకాశాలు ఈ వృద్ధి అంచనాలకు ప్రధాన బలంగా నిలిచాయని నివేదిక పేర్కొంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల విస్తరణతో భారత వాణిజ్య నెట్‌వర్క్ మరింత బలోపేతం అయిందని జ్ ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు. ప్రధాన ఆర్థిక సమూహాలతో పెరుగుతున్న వాణిజ్య సంబంధాలు దేశ వృద్ధి అవకాశాలను మరింత ప్రకాశవంతం చేస్తున్నాయని ఆయన తెలిపారు. దేశంలో కొనసాగుతున్న నిర్మాణాత్మక సంస్కరణలు కూడా ఆర్థిక దిశను మార్చుతున్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఈ చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత స్థానం మరింత బలపడేందుకు దోహదపడుతున్నాయి. సాధారణ ప్రజలపై ప్రభావం పరంగా చూస్తే, వ్యక్తిగత ఆదాయపు పన్ను, జీఎస్టీ నిర్మాణాల్లో చేసిన మార్పులు కుటుంబాల వినియోగయోగ్య ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఉన్నాయి. ప్రజల చేతుల్లో డబ్బు పెరిగితే వినియోగం పెరిగి, అది ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అయితే పన్ను మినహాయింపుల వల్ల ప్రభుత్వానికి ఆదాయ లోటు ఒత్తిడి పెరిగే అవకాశముందని నివేదిక హెచ్చరించింది. 2026 ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తిగా చేరుకోలేకపోవచ్చని కూడా అంచనా వేసింది. ఇదిలా ఉండగా అభివృద్ధి చెందిన భారతదేశం 2047 లక్ష్య సాధనకు పన్ను-జీడీపీ నిష్పత్తి పెంపు కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ప్రస్తుత విధానాలపై మార్కెట్ విశ్లేషకులు విశ్వాసంగా ఉన్నారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటు లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఉన్నాయని వారు భావిస్తున్నారు.

# ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండానే రూ.1.25 లక్షల లోన్! ఎలా పొందాలంటే..



దేశంలో తక్కువ ఆదాయ కుటుంబాలకు మైక్రోఫైనాన్స్ రుణాలు కీలక ఆర్థిక సహాయంగా నిలుస్తున్నాయి. సాధారణ బ్యాంకు రుణాలు పొందలేని వర్గాలకు ఇవి చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి, విద్యా, అత్యవసర ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. తిరిగి చెల్లింపులో సౌలభ్యం, ముందస్తు చెల్లింపుకు జరిమానా లేకపోవడం వంటి ప్రయోజనాలున్నాయి. దేశంలో తక్కువ ఆదాయ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు మైక్రోఫైనాన్స్ రుణాలు కీలకంగా మారుతున్నాయి. సాధారణ బ్యాంకు రుణాలు పొందలేని వర్గాలకు ఈ రుణాలు ప్రత్యేకంగా ఉపయోగపడుతున్నాయని ఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు చిన్న వ్యాపారం ప్రారంభించడానికి, అత్యవసర ఖర్చులు తీర్చడానికి, పిల్లల విద్యా ఫీజులు చెల్లించడానికి ఈ రుణాలను ఎక్కువగా వినియోగిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్వచనం ప్రకారం.. మైక్రోఫైనాన్స్ రుణం అంటే ఎటువంటి పూచీకత్తు లేకుండా తక్కువ ఆదాయ కుటుంబాలకు ఇచ్చే చిన్న రుణం. వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకు ఉన్న కుటుంబాలు దీనికి అర్హులు. రుణానికి భూమి, ఇల్లు, బంగారం వంటి ఆస్తులను భద్రతగా పెట్టాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ సెక్యూరిటీ తీసుకుంటే అది మైక్రోఫైనాన్స్ కేటగిరీలోకి రాదు ఈ రుణాల పరిధిలో విద్యా రుణాలు, అత్యవసర అవసరాల రుణాలు, వ్యవసాయ రుణాలు, ఆదాయం పెంచే రుణాలు, వినియోగ వస్తువుల కొనుగోలు రుణాలు, చిన్న వ్యాపార రుణాలు వంటి విభాగాలు ఉంటాయి. సాధారణంగా రుణ పరిమితి రూ.10,000 నుంచి రూ.1.25 లక్షల వరకు ఉంటుంది. తిరిగి చెల్లింపు కాలం సాధారణంగా ఒకటి నుంచి మూడు సంవత్సరాల మధ్య ఉంటుంది. వాయిదా చెల్లింపులో కూడా సౌలభ్యం కల్పించారు. వారానికోసారి లేదా నెలవారీగా చెల్లించే అవకాశం ఉంటుంది. అయితే మొత్తం ఇంటి ఆదాయంలో వాయిదా భారము 50 శాతం మించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ముందస్తు చెల్లింపుపై ఎలాంటి జరిమానా లేకపోవడం మరో ప్రయోజనం. వడ్డీ రేట్లపై స్థిర పరిమితి లేకపోయినా, సంస్థలు అనవసరంగా అధిక వడ్డీ వసూలు చేయరాదని ఆర్‌బీఐ మార్గదర్శకాలు చెబుతున్నాయి. వడ్డీ నిర్ణయం సంస్థ బోర్డు ఆమోదించిన విధానం ప్రకారం నిధుల ఖర్చు, ప్రమాదం, నిర్వహణ వ్యయం ఆధారంగా నిర్ణయించాలి. బ్యాంకులు, చిన్న ఆర్థిక బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, చీదీఖీజలు, NBFC-MFIలు, సహకార బ్యాంకులు, స్వయం సహాయక బృందాలు, ఎన్‌జీఓలు వంటి ఆర్‌బీఐ నియంత్రిత సంస్థలు మాత్రమే ఈ రుణాలను అందించగలవని స్పష్టం చేసింది.

# కొత్త డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్.. ఆ పాయింట్లు తగ్గితే పూర్తిగా లైసెన్స్ క్యాన్సిల్.. కేంద్రం కొత్త రూల్స్




కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త రూల్ తీసుకురాబోతుంది. ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలను కఠినతరం చేయనుంది. ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఎక్కువగా పాల్పడితే పూర్తిగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయనుంది. త్వరలో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం త్వరలో బిగ్ షాకివ్వనుంది. త్వరలోనే కొత్త డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలను అమలు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇక నుంచి ట్రాఫిక్ నిబంధనలకు పాల్పడేవారికి గ్రేడింగ్ పాయింట్ల విధానం అమలు చేయనుంది. అంటే మీరు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినప్పుడల్లా పాయింట్లను తగ్గించేస్తూ ఉంటారు. చివరికి అన్నీ పాయింట్లు తగ్గిపోయిన తర్వాత మీ డ్రైవింగ్ లైసెన్స్ ఆరు నెలల పాటు నిషేధించడం లేదా పూర్తిగా రద్దు చేయడం లాంటివి చేస్తారు. గురువారం జరిగిన సీఐఐ క్లాన్‌కేవ్ సమావేశంలో కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ గ్రేడింగ్ పాయింట్ల విధానం గురించి వివరాలు వెల్లడించారు. దీని గురించి పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**డ్రైవింగ్ లైసెన్స్ రద్దు**

త్వరలో దేశంలో డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ పూర్తిగా మారనున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ప్రజలందరూ పాటించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కఠిన రూల్స్ కేంద్రం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్‌కు గ్రేడ్ పాయింట్ల విధానాన్ని అమలు చేయనుంది. ఈ విధానం ఎలా పనిచేస్తుందంటే.. ప్రతీ డ్రైవింగ్ లైసెన్స్‌కు పాయింట్లు కేటాయిస్తారు. మీరు ఏదైనా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడినప్పుడల్లా పాయింట్లు తగ్గుతూ వస్తాయి. ఇలా ట్రాఫిక్ ఉల్లంఘనలు ఎక్కువై పాయింట్లు అన్నీ కోల్పోయినప్పుడు అధికారులు చివరికి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. ఈ విధానాన్ని త్వరలోనే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు నితిన్ గడ్కరీ వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు భయం, గౌరవం ఉండటం లేదని, అందువల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**త్వరలోనే కొత్త రూల్స్**

గ్రేడ్ పాయింట్లు అన్నీ కోల్పోయిన తర్వాత ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌పై నిషేధం విధిస్తారు. అలాగే పూర్తిగా రద్దు చేసే అవకాశం కూడా ఉంటుంది. త్వరలోనే ఈ రూల్స్‌ను అమలు చేస్తామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఇక దేశంలో ప్రతీ ఏడాది 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, భారతదేశంలో ఎక్కువ మరణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ విధి అని, అందుకే నివారణకు అనేక చర్యలు తీసుకుంటామన్నారు.

# అయ్యబాబోయ్.. 2026 చివరి నాటికి ఊహించని రేంజ్‌కు బంగారం ధర..! ఎంతో తెలిస్తే నోరెళ్లబెడతారు..



బంగారం కొనాలనుకుంటున్నారా.. రేట్లు తగ్గుతాయని వెయిట్ చేస్తున్నారా? అయితే మీకు షాకింగ్ న్యూస్.. త్వరలో బంగారం ధరలు ఊహించని రేంజ్‌లో పెరగబోతున్నాయని ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం జేపీ. మోర్గాన్ హెచ్చరించింది. 2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చే మార్పుల వల్ల మన దేశంలో తులం బంగారం ఎంత ఉంటుందో తెలుసా.. బంగారం అంటే భారతీయులకు ఎంతో సెంటిమెంట్. పండగైనా, శుభకార్యమైన బంగారం కొనాల్సిందే. అయితే గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఆకాశాన్నంటుతూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే 2026లో బంగారం ధరలు తగ్గుతాయని చాలా మంది ఆశతో ఎదురుచూస్తున్నారు.అయితే ఈ వార్త మీకు షాకింగ్ గురిచేయవచ్చు. ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జేపీ. మోర్గాన్ బంగారం ధరలపై సంచలన నివేదికను విడుదల చేసింది. ఇప్పుడు కనిపిస్తున్న ధరల పెరుగుదల కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన గోల్డ్ రష్ ముందుందని స్పష్టం చేసింది.

**2026 నాటికి ఊహించని పెరుగుదల..**

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర సుమారు 5,200 డాలర్ల వద్ద ఉంది. అయితే మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితి వల్ల ఇది ఏకంగా 6,300 డాలర్లకు మార్కును చేరుకుంటుందని జె.పి. మోర్గాన్ అంచనా వేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగితే.. దాని ప్రభావం భారత్‌పై భారీగా ఉంటుంది. ప్రస్తుతం ఒక సావరిన్ (8 గ్రాములు) బంగారం ధర రూ. 1,19,360 పలుకుతుండగా, జేపీ మోర్గాన్ అంచనాల ప్రకారం.. భవిష్యత్తులో మన దేశంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ. 2 లక్షలకు చేరే ప్రమాదం ఉంది. అంటే ఒక గ్రాము బంగారం కొనడానికి కూడా సామాన్యులు వేల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది.

**ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?**

అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు బంగారం వైపు పెట్టుబడిదారులను మళ్లిస్తున్నాయి. యుద్ధ వాతావరణం, ఆర్థిక మందగమనం ఉన్నప్పుడు పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది శుభవార్త అయినప్పటికీ, ఆభరణాల కోసం కొనేవారికి ఇది భారమే. ధరలు తగ్గుతాయని ఆశించి వేచి చూస్తే, మున్ముందు మరింత ఎక్కువ ధరకు కొనాల్సి రావచ్చు. అందుకే బంగారం కొనాలనుకునే వారు ఇప్పుడే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. రీఫండ్ రూల్స్‌లో మార్పులు.. 48 గంటల్లోపు క్యాన్సిల్ చేస్తే..



విమాన ప్రయాణికులకు డీజీసీఏ శుభవార్త అందించింది. ఇండిగో సంక్షోభం క్రమంలో ప్రయాణికులు రీఫండ్ పొందటంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. చాలామందికి సకాలంలో రీఫండ్ లభించలేదు. ఈ క్రమంలో డీజీసీఏ కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇక నుంచి ప్రయాణికులకు ఉపయోగపడేలా క్యాన్సిలేషన్ రూల్స్ మార్చింది. విమాన ప్రయాణికులకు శుభవార్త. ఫ్లైట్ టికెట్ క్యాన్సిలేషన్, రీఫండ్ రూల్స్ మారాయి. ఈ మేరకు ఇప్పటివరకు ఉన్న నిబంధనల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ఊ+జూ) కీలక మార్పులు చేసింది. విమాన టికెట్లను ప్రయాణికులు రద్దు చేసుకునే సమయంలో టికెట్ రీఫండ్‌కి సంబంధించిన నియమాలను డీజీసీఏ సవరించింది. ఇక నుంచి ప్రయాణికులు ఫ్లైట్ బయల్దేరే షెడ్యూల్ సమయానికి 48 గంటల్లోపు టికెట్ క్యాన్సిల్ చేసుకోవచ్చు. ఎలాంటి అదనపు ఛార్జీలను చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉచితంగా టికెట్ క్యాన్సిల్ చేసుకోవచ్చు. విమానాల రద్దు, షెడ్యూల్స్‌లో మార్పులు జరిగినప్పుడు ప్రయాణికులు నష్టపోకూడదనే కారణంతో రీఫండ్ నిబంధనలను సవరిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.

**క్యాన్సిలేషన్ నిబంధనలు మార్పు**

ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నాక 48 గంటల్లోపు క్యాన్సిల్ చేసుకోవచ్చు.. ఇందుకు ఎటువంటి ఎక్స్‌ట్రా చార్జీలు చెల్లించాల్సిన అవసం లేదు

విమానయాన సంస్థలు 14 రోజుల్లోపు రీఫండ్ ప్రాసెస్ పూర్తి చేయాలి

టికెట్ బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల్లోపు సాధారణ పేరు మార్చుకునేందుకు ఎలాంటి ఛార్జ్ విధించకూడదు


ఎయిర్‌లైన్ సొంత వెబ్ సైట్, యాప్‌ల ఆధారంగా చేసుకున్న బుకింగ్స్‌కు ఈ రూల్స్ వర్తిస్తాయి

ఇక ట్రావెల్ ఏజెంట్లు, థర్డ్ పార్టీ పోర్టల్స్ ద్వారా టికెట్లు కొనుగోలు చేస్తే 14 పని దినాల్లోపు రీఫండ్ ఇవ్వాల్సి ఉంటుంది

**మార్పులు ఎందుకంటే..**

ఇటీవల ఇండిగో సంక్షోభం క్రమంలో వేలాది విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రీఫండ్ రావడంలో జాప్యం జరగడంతో ప్రయాణికులు నష్టపోయారు. ఈ క్రమంలో విమానయాన సంస్థలు రీఫండ్స్ సరిగ్గా ఇవ్వడం లేదంటూ డీజీసీఏకి చాలామంది ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో డీజీసీఏ ఈ కొత్త రీఫండ్ నిబంధనలను ప్రవేశపెట్టింది. ఇవి ప్రయాణికులు సులభంగా రీఫండ్ పొందటంలో ఉపయోగపడనున్నాయి. 48 గంటల్లోపు క్యాన్సిల్ చేసుకుంటే ఎలాంటి ఛార్జీలు ఉండకపోవడం వల్ల ప్రయాణికులు ప్రణాళికలను పునరాలించుకోవడానికి స్వల్ప గ్రేస్ పీరియడ్ పొందుతారు. ఇక టికెట్లలో పేర్ల స్పెల్లింగ్ మిస్టేక్ ఉంటే 24 గంటల్లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు తీసుకోకుండా ప్రయాణికులకు అవకాశం కలగనుంది. ఇది కూడా దేశంలోని విమాన ప్రయాణికులకు ఊరట కలిగించే అంశమని చెప్పవచ్చు. గత ఏడాది డిసెంబర్‌లో ఇండిగో సంక్షోభం తర్వాత డీజీసీఏ ఈ నిర్ణయాలు అమల్లోకి తెచ్చింది. ఆ సంక్షోభం నుంచి ఎదుర్కొన్న పాఠాలతో ప్రయాణికులకు ఉపయోగపడేలా ఈ కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఫ్లైట్ టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే ఛార్జీలు విధించేవారు. ఇప్పటినుంచి ఇక ఎలాంటి ఛార్జీలు ఉండవు.

# ద్రవ్యోల్బణం అంటే ఏంటి? అది మన డబ్బుపై ఎలాంటి ప్రభావం చూపుతుందంటే?




ద్రవ్యోల్బణం అంటే వస్తువులు, సేవల ధరలు పెరగడం. ఇది సామాన్యుడి కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, జీవన వ్యయాన్ని పెంచుతుంది. మీ సంపాదనతో తక్కువ వస్తువులే కొనగలుగుతారు, దీనివల్ల కుటుంబ ఖర్చులు పెరిగి పొదుపు తగ్గుతుంది. ఆహారం, ఇంధనం వంటి నిత్యావసరాల ధరలు పెరిగితే మధ్యతరగతిపై భారం పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో తరచుగా వినిపించే పదం ద్రవ్యోల్బణం. అయితే అసలు ద్రవ్యోల్బణం అంటే ఏంటి? ఇది సామాన్యుడి రోజువారీ జీవితంపై ఎలా ప్రభావం చూపుతుంది? అనే ప్రశ్నలు ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. నిపుణుల వివరణ ప్రకారం.. మార్కెట్లో వస్తువులు, సేవల ధరలు కాలక్రమేణా పెరగడాన్ని ద్రవ్యోల్బణం అంటారు. అంటే ఈరోజు రూ.100కు కొనుగోలు చేసే వస్తువు కొంతకాలం తర్వాత రూ.110 లేదా అంతకంటే ఎక్కువ కావడం ద్రవ్యోల్బణానికి ఉదాహరణ. ద్రవ్యోల్బణం పెరిగితే మొదట ప్రభావం పడేది సామాన్యుడి కొనుగోలు శక్తిపై. జీతం అదే స్థాయిలో ఉన్నా, వస్తువుల ధరలు పెరగడంతో అదే డబ్బుతో తక్కువ వస్తువులు మాత్రమే కొనగలుగుతారు. దీనివల్ల కుటుంబ ఖర్చులు పెరిగి పొదుపు తగ్గిపోతుంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆహారం, ఇంధనం, అద్దె, విద్య, వైద్యం వంటి అవసరాల ధరలు పెరిగితే గృహ బడ్జెట్ కుదేలవుతుంది. ఉదాహరణకు కూరగాయలు లేదా పెట్రోల్ ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా ప్రతి కుటుంబానికి తాకుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ద్రవ్యోల్బణం పూర్తిగా ప్రతికూలం మాత్రమే కాదు. మితమైన స్థాయిలో ఉన్నప్పుడు ఇది ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరుగుదలకు సంకేతంగా పరిగణిస్తారు. కానీ అధిక స్థాయికి చేరితే జీవన వ్యయం భారంగా మారుతుంది. అందుకే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల మార్పులు వంటి చర్యల ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రయత్నిస్తుంటాయి. మొత్తంగా చూస్తే, ద్రవ్యోల్బణం పెరుగుదల సామాన్యుడి జేబుపై నేరుగా ప్రభావం చూపుతుంది. కాబట్టి ఖర్చులను ప్లాన్ చేసుకోవడం, పొదుపు అలవాటు పెంచుకోవడం, దీర్ఘకాల పెట్టుబడులు పెట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## నాన్‌సెన్స్‌కు బ్యాట్ తోనే సమాధానం

## ముందుకు సాగిపోండి సార్!'- అభిషేక్‌పై యువీ ప్రశంసలు



టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఫామ్ లోకి వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్ ల్లో ఘోరంగా విఫలమైన ఈ యువ ఓపెనర్ తాజాగా జింబాబ్వేతో మ్యాచ్ లో అర్ధ శతకంతో రాణించాడు. 30 బంతుల్లో 55 పరుగులు చేసి, తన ఫామ్ పై మేనేజ్ మెంట్ కు ఉన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేశాడు. ఈ క్రమంలోనే అతడి ఇన్నింగ్స్ పై మాజీ క్రికెటర్, తన మెంటార్ యువరాజ్ సింగ్ మోటివేషనల్ మెసేజ్ పంపించాడు. ప్రదర్శననే మాట్లాడనివ్వు! ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్ లో స్టోరీ షేర్ చేశాడు. అభిషేక్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపిస్తూ మెసేజ్ రాసుకొచ్చాడు. 'అర్థంలేని చర్చలు జరుగుతున్నప్పుడు బ్యాటింగ్ తోనే మాట్లాడావు. అభిషేక్ సార్ ఇది మంచి ప్రదర్శన. ఇలాగే ముందుకు సాగిపో' అని ఇన్ స్టా స్టోరీ రాసుకొచ్చాడు. అయితే ఈ టోర్నీలో అభిషేక్ వరుసగా ఫెయిల్ అవ్వడంతో అతడిపై త్రంగా విమర్శలు వచ్చాయి. అందుకే అతడికి మద్దతుగా యువీ ఈ మెసేజ్ షేర్ చేశాడని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. అలాగే ఈ మ్యాచ్ లో ఆకట్టుకున్న హార్దిక్ పాండ్య, అర్షదీప్ సింగ్ పై కూడా యూవీ ప్రశంసలు కురిపించాడు. 'అద్భుతమైన పవర్ హిట్టింగ్. ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ముంగించావు' అని హార్దిక్‌ను ప్రశంసించగా, 'స్పీడ్ స్టర్ అర్షదీప్ ట్రిపుల్ ధమాకా. సరైన సమయంలో వికెట్లు తీసి ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టావు' అని యువీ పోస్టు చేశాడు.

అభిషేక్‌ను ప్రశంసిస్తూ యువీ ఇన్‌స్టా స్టోరీ

యువీ కంటే అభికే పవర్ ఎక్కువ : పాక్ మాజీకి అశ్విన్ కౌంటర్

ఇటీవల అభిషేక్ విఫలం అవ్వడం వల్ల అతడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ కూడా అభిషేక్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'అభిషేక్‌కు డిఫెన్సివ్ క్రికెట్ ఆడడం రాదు. స్కిల్స్ లేవు, అతడు ఓ స్లోగర్ మాత్రమే' అని వ్యాఖ్యానించాడు. అయితే ఆమిర్ వ్యాఖ్యలకు తాజాగా టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కౌంటర్ ఇచ్చాడు. తన యూట్యూబ్ ఛానెల్ లో దీనిపై మాట్లాడాడు. 'అభిషేక్ పై మహ్మద్ ఆమిర్ చేసిన కామెంట్స్ తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే 'ఏ విధంగా అభిషేక్ మీకు స్లాగర్ గా కనిపిస్తున్నాడు?'. అతని ఆటతీరు గురించి మాట్లాడొచ్చు. కానీ, అలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. రీసెంట్ గా జింబాబ్వేతో మ్యాచ్ లో అతడి బ్యాటింగ్ సూపర్' 'తన మెంటార్ యువరాజ్ సింగ్ అని అందరికీ తెలుసు. కానీ యువరాజ్ కంటే అభిషేక్ కే పవర్ ఎక్కువ. తాను బాదిన బంతి ఎంతో దూరం వెళ్తుంది. అయితే, అతడికి స్కిల్స్ లేవని కొందరు అనుకుంటారు. కానీ అభిషేక్ జింబాబ్వేపై తాజా మ్యాచ్ లో అతడు అద్భుతమైన నైపుణ్యం దర్శించాడు' అని అశ్విన్ అభిషేక్ పై ప్రశంసలు కురిపించాడు. అయితే తన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అవ్వడంతో ఆమిర్ ఇప్పటికే దీనిపై సారీ చెప్పాడు. యువీ రికార్డ్ సమం కాగా, ఈ మ్యాచ్ లో టీమ్‌ఇండియా బ్యాటర్లు హార్దిక్ పాండ్య, ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించారు. ఈ ఇద్దరూ యువరాజ్ సింగ్ రికార్డ్ ను సమం చేశారు. సింగిల్ టీ20 వరల్డ్ కప్ ఎడిషన్ లో అత్యధిక సిక్స్ లు బాదిన బ్యాటర్లుగా యువీ రికార్డ్ ను హార్దిక్, ఇషాన్ సమం చేశారు. 2007 ఎడిషన్ లో యువీ 12 సిక్స్ లు బాదగా, ప్రస్తుత టోర్నీలో హార్దిక్, ఇషాన్ ఇప్పటికే చెరో 12 సిక్స్ లు బాదేశారు. ఇంకో సిక్స్ బాదితే యువీ రికార్డ్ బ్రేక్ అవుతుంది. అయితే పొట్టి కప్పులో అత్యధిక సిక్స్ లు బాదిన భారత్ బ్యాటర్ గా రోహిత్ శర్మ టాప్ లో ఉన్నాడు. అతడు 2024లో 15 సిక్స్ లు కొట్టాడు.

## "క్రెడిట్ కార్డు" వాడుతున్న వ్యక్తి చనిపోతే

# దానిపై ఉన్న బిల్లు ఎవరు కట్టాలి

### క్రెడిట్ కార్డు హోల్డర్ మరణిస్తే అప్పు ఫ్యామిలీ మెంబర్స్ కట్టాలా – ఆర్ బీఐ రూల్స్ ఏం చెబుతున్నాయంటే




నేటి డిజిటల్ యుగంలో క్రెడిట్ కార్డుల వాడకం బాగా పెరిగిపోయింది. గృహోపకరణాలు కొనుగోలు చేయాలన్నా, ఆసుపత్రి బిల్ చెల్లించాలన్నా, ఆఖరికి షాపింగ్ చేయాలన్నా కూడా మెజార్టీ పీపుల్ క్రెడిట్ కార్డునే వినియోగిస్తున్నారు. కొందరైతే ఏదైనా వస్తువు కొని ఆ బిల్లును ఈఎంఐ రూపంలో చెల్లిస్తుంటారు. అలాగే, మరికొందరు బ్యాంకుల నుంచి క్రెడిట్ కార్డ్స్ ఆధారంగా పర్సనల్ లోన్స్ తీసుకుంటుంటారు. కానీ, ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో క్రెడిట్ కార్డు హోల్డర్ చనిపోతే ఆ కార్డు పైన ఉన్న అప్పు లేదా బిల్లును ఎవరు తిరిగి చెల్లిస్తారు? ఫ్యామిలీ మెంబర్స్ చెల్లించాలా అనే సందేహాలు చాలా మందికి వస్తుంటాయి. మరి, ఇంతకీ క్రెడిట్ కార్డు తీసుకున్న వ్యక్తి మరణిస్తే దానిపై ఉన్న అప్పును ఎవరు కడతారు ఇందుకు సంబంధించి ఆర్ బీఐ నిబంధనలు, చట్టాలు ఏం చెబుతున్నాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం. నార్మల్ గా మనం ఏదైనా లోన్ తీసుకున్నప్పుడు ఇల్లు, భూమి, బంగారం లేదా మరేదైనా వస్తువును షూరిటీగా పెడుతుంటాం. వీటిని సెక్యూర్డ్ లోన్స్ అంటారు. కానీ, క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాలు ఇందుకు భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే ఎటువంటి ఆస్తిని తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు. బ్యాంకులు మీ ఆదాయం, క్రెడిట్ స్కోర్ ను పరిశీలించి క్రెడిట్ కార్డులు ఇస్తుంటాయి. అందుకే, క్రెడిట్ కార్డు రుణాలను "అన్ సెక్యూర్డ్ లోన్స్" అంటారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్ బీఐ) నిబంధనల ప్రకారం, అటువంటి రుణాలకు పూర్తి బాధ్యత కార్డుదారుడికే ఉంటుంది. దీనిని బట్టే క్రెడిట్ కార్డుకు సంబంధించి బ్యాంకులు ఫాలో అయ్యే నిబంధనలు ఉన్నాయి.

ఫ్యామిలీ మెంబర్స్ చెల్లించాలా

క్రెడిట్ కార్డు హోల్డర్ చనిపోతే బ్యాంకులు ఆ వ్యక్తి చేసిన అప్పు లేదా బిల్లును ఫ్యామిలీ మెంబర్స్ లేదా వారసులను తిరిగి చెల్లించమని బలవంతం చేసే అధికారం లేదని చెబుతున్నాయి ఆర్ బీఐ నిబంధనలు. అలాగే, వారి వ్యక్తిగత ఆస్తుల నుంచి ఆ అప్పును తీర్చనక్కర్లేదు. చట్టపరంగానూ బాధిత కుటుంబ వారసులను వారి సొంత డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేసే అధికారం బ్యాంకు వారికి లేదు. ఎందుకంటే ఆ అప్పుకు కార్డు హోల్డరే బాధ్యుడు. ఒకవేళ ఎవరైనా రికవరీ ఏజెంట్ మిమ్మల్ని బెదిరించి మీ వ్యక్తిగత ఆస్తుల నుంచి ఆ అప్పు చెల్లించమని బలవంతం చేస్తే మీరు పోలీసులకు కంప్లైంట్ ఇవ్వొచ్చు. అంతేకాదు, మీరు కోరుకుంటే లోక్‌పాల్ (అంబుడ్స్‌మన్)కి కూడా ఫిర్యాదు చేయవచ్చు.

ఆస్తుల నుంచి అప్పు వసూలు చేస్తారా

క్రెడిట్ కార్డు హోల్డర్ చనిపోయినంత మాత్రాన తీసుకున్న అప్పు లేదా బిల్లు మాఫీ అయిపోదని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బ్యాంకులు చనిపోయిన వ్యక్తి పేరు మీద ఉన్న ఆస్తుల ద్వారా బకాయిలను వసూలు చేసే హక్కు కలిగి ఉంటాయి. అంటే, ఆ వ్యక్తి పేరు మీద ఉండే బ్యాంక్ బ్యాలెన్స్, బంగారం, వెండి, ఎఫ్ డీలు, షేర్లు లేదా ఇతర స్థిరాస్తుల నుంచి బ్యాంకు అప్పును రికవరీ చేసే హక్కు ఉంటుంది. అలాగే, ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, కార్డు హోల్డర్ అప్పు ఆస్తుల కంటే ఎక్కువగా ఉంటే ఆస్తి విలువ మేరకే బ్యాంకు వసూలు చేసే అధికారం కలిగి ఉంటుంది. ఉదాహరణకు క్రెడిట్ కార్డు హోల్డర్ అప్పు రూ. 5 లక్షలుగా ఉంది. కానీ, బాధితుడి ఆస్తి విలువ రూ.3 లక్షలు మాత్రమే అయితే మిగతా రూ.2 లక్షలు బ్యాంకులు మాఫీ చేయాల్సిందేనని ఆర్ బీఐ నిబంధనలు చెబుతున్నాయి. రాంగ్ నంబర్ కు "డబ్బులు" సెండ్ చేశారా – నో టెన్షన్ ఇలా తిరిగి పొందండి!

ఆస్తులు లేనట్లయితే

ఒకవేళ చనిపోయిన క్రెడిట్ కార్డు తీసుకున్న వ్యక్తి వద్ద ఆస్తులేమి లేనట్లయితే బ్యాంకు ఆ కార్డుపై ఉన్న అప్పును వసూలు చేయలేదు. అలాంటి సందర్భాల్లో ఆ అప్పును బ్యాంకు ఛీూూ(చీశీఅ ూవతీటశీతీఎఱఅస్త్ర ూంంవ్) అని రైట్ ఆఫ్ చేస్తుంది. అంటే, అలాంటి పరిస్థితిలో ఆ కార్డుపై ఉన్న రుణం మొత్తం మాఫీ అవుతుందన్నమాట.

ఇలా ఉంటే అప్పు కట్టాల్సిందే!

ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం, ఒకవేళ క్రెడిట్ కార్డును ఇద్దరు వ్యక్తులు కలిసి తీసుకుంటే అలాంటి టైమ్ లో ఒక వ్యక్తి చనిపోయినా కూడా మరొకరు పర్సనల్ గా ఆ క్రెడిట్ కార్డు అప్పు గురించి రెస్పాన్సిబుల్ అవుతారు. అంటే, ఆ అప్పును పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఎవరైనా హామీదారుగా సంతకం చేసినట్లయితే కూడా బ్యాంకు వారి నుంచి చనిపోయిన వ్యక్తి చెల్లించాల్సిన అప్పు తిరిగి పొందే ఛాన్స్ ఉంటుంది.

ఇది గుర్తుంచుకోవాలి!

క్రెడిట్ కార్డు తీసుకున్న పర్సన్ చనిపోయాడు దానికి సంబంధించిన క్రెడెన్షియల్స్ నాకు తెలుసు నేను వాడుతా అన్నట్లయితే మీరు ఫ్యామిలీ మెంబర్ అయినా కూడా ఫ్రాడ్ అని దాన్ని లెక్కిస్తారు. కాబట్టి, క్రెడిట్ కార్డు పర్సన్ చనిపోయిన వెంటనే బ్యాంకుకు వెళ్లి వాళ్ల డెత్ సర్టిఫికేట్ సబ్మిట్ చేయాలి. అలా చేసినట్లయితే క్రెడిట్ కార్డుకు ఉన్న అప్పు మీద ఎక్స్ ట్రా వడ్డీ అన్నది లెక్కించరు.

# త్తిడిని గుర్తించడమే అసలు సమస్య- మహిళల్లో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో తెలుసా

## మహిళల్లో ఒత్తిడి తగ్గించుకోవాలంటే ఇలా చేయాలంటున్న నిపుణులు!



నేటి తరం ఉద్యోగినుల్లోనే కాదు.. విద్యార్థినులూ, గృహిణుల్లోనూ ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని పలు అధయనాల్లో వెల్లడైంది. కాకపోతే, చాలా మంది దాన్ని అసలు ఒత్తిడిగానే గుర్తించరట. అది పెరిగి తీవ్ర రూపం దాల్చక ముందే గుర్తించి అదుపులో ఉంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఒత్తిడిగా ఉంటే ఎలా లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం!

నిద్ర పట్టదు :

ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిలో అసలు నిద్రపట్టదంటున్నారు నిపుణులు. ఒకవేళ మితిమీరిన అలసట వల్ల త్వరగానే నిద్రపోయినా అంతే త్వరగా మెలకువ వచ్చేస్తుందని చెబుతున్నారు. లేదంటే, తరచూ పీడకలలతో కలత నిద్రకు గురవుతుంటారని పేర్కొంటున్నారు. ఇలాంటి లక్షణాలు మీలోనూ కనిపిస్తే.. ఏదో ఆందోళన, ఒత్తిడి ఉన్నట్లేనని గుర్తించమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళన చెందకుండా పని విభజన చేసుకోవడం, రోజూ కాసేపు ధ్యానం చేయడం వంటివి చేస్తే ప్రాథమిక దశలోనే ఒత్తిడి బారిన పడకుండా ఉంటారని సలహా ఇస్తున్నారు. అలసట లేదా నిద్ర పట్టకపోవడం అనేది ఒత్తిడి శారీరక లక్షణమని అధ్యయనం పేర్కొంది.

ఆకలిలో మార్పులు :

సాధారణంగా ఒత్తిడి పెరిగే కొద్దీ ఆహారం.. అందులోనూ తీపి పదార్థాలు ఎక్కువగా తినాలనే ఆలోచన కలుగుతుందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. కానీ, అదే సమయంలో కొంతమంది ఆకలినీ కోల్పోతారని నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆకలి వేస్తే తీపి పదార్థాలకు బదులు తాజా పండ్లు, ఖర్జూరం, ఎండు ఫలాలు, నట్స్, మంచినీళ్లు వంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, ఆకలి లోపిస్తే వ్యాయామంపై దృష్టి పెట్టాలని సలహా ఇస్తున్నారు. కనీసం ఓ ఇరవై నిమిషాలైనా రోజూ శ్రమ చేయగలిగితే అన్ని సమస్యలూ అదుపులోకి వస్తాయని పేర్కొంటున్నారు. ఒత్తిడి, అది విడుదల చేసే హార్మోన్లు, అధిక కొవ్వు, చక్కెర ప్రభావాలు ప్రజలను అతిగా తినడానికి ప్రేరేపిందని అధ్యయనం పేర్కొంది. అలాగే, కొందరిలో ఒత్తిడి ఆకలిని తగ్గిస్తుందని తెలిపింది.

కోపం ఎక్కువగా రావడం :

స్వతహాగా శాంత స్వభావి అయినా, ఒక్కోసారి పట్టలేనంత కోపం వచ్చేస్తుంది. అందులోనూ నెలసరి వేళల్లోనూ, మెనోపాజ్ దశలోనూ ఈ ఇబ్బంది కాస్త ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వాటితో పాటు సాధారణ సందర్భాల్లోనూ చిన్న విషయానికీ ఎక్కువ కోపం వచ్చేస్తోందా ప్రతి విమర్శనూ తీవ్రంగా తీసుకుంటున్నారా అయితే ఇది ఒత్తిడి లక్షణమే కావొచ్చంటున్నారు. అలా ఎప్పుడైనా అనిపిస్తుంటే వెంటనే పక్కకు వెళ్లమని సూచిస్తున్నారు. దాన్ని ప్రదర్శించడానికి ముందు ఓ పుస్తకంలో రాయాలని సలహా ఇస్తున్నారు. ఈ స్ట్రెస్ నుంచి బయటపడాలంటే కాసేపు చెప్పుల్లేకుండా బాల్కనీ, ఇసుక, నీళ్లు, గడ్డి ఇలా ఎక్కడైనా నడవాలని సూచిస్తున్నారు. లేకుంటే, ఐదు నుంచి ఆరు సార్లు దీర్ఘంగా శ్వాస తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఇవన్నీ చేసినా ఫలితం లేదంటే కచ్చితంగా సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్‌ని కలిస్తే మంచిదంటున్నారు. వాళ్లు తగిన చికిత్స మీకు అందిస్తారని తెలియజేస్తున్నారు. కాసేపు ప్రశాంతంగా ప్రకృతిలో నడవడం, ధ్యానం, సంగీతం వినడం, పుస్తక చదవడం, డ్యాన్స్ చేయడం ఇలా మనకు ఇష్టమైన పనులను చేయడం లాంటివి దోహదపడతాయని అంటున్నారు. కనీసం 20 నుంచి 30 నిమిషాలు ప్రకృతిలో నడవడం వల్ల కార్టిసాల్ స్థాయిలు ఎక్కువగా తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది. దీంతో ఒత్తిడి తగ్గుతుందని చెబుతుంది. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఖాతాదారులకు గుడ్ న్యూస్- 7లక్షల ఖాతాల్లో నిలిచిన నిధులు విడుదల- ఇక 3 రోజుల్లోనే క్లెయిమ్ సెటిల్మెంట్!

## 7 లక్షలకు పైగా ఇన్‌ఆపరేటివ్ పీఎఫ్ ఖాతాల సొమ్ము వాపస్- రూ.1,000 లోపు బ్యాలెన్స్ ఉన్నవారికి త్వరలో చెల్లింపులు!




పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ ఓ)లో నిలిచిపోయిన రూ.3.52 కోట్ల నిధులను త్వరలోనే ఆయా ఖాతాదారులు లేదా వారి వారసులకు తిరిగి చెల్లించనున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ వర్గాలు సోమవారం వెల్లడించాయి. సుమారు 7.11 లక్షల ఇన్ ఆపరేటివ్ (నిష్క్రియాత్మకంగా ఉన్న) ఖాతాల్లోని నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపాయి. ముఖ్యంగా రూ.1000 లోపు బ్యాలెన్స్ ఉన్న వాటిని త్వరలోనే సెటిల్ చేయాలని కార్మిక మంత్రిత్వ శాఖ సమీక్షా సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నాయి.

ఇన్‌ఆపరేటివ్ ఖాతాలు అంటే ఏమిటి

వరుసగా 36నెలలపాటు ఉద్యోగి లేదా యజమాని నుంచి ఎలాంటి కంట్రిబ్యూషన్ జమ కానీ పీఎఫ్ ఖాతాలను 'ఇన్ ఆపరేటివ్ ఖాతా'లుగా పరిగణిస్తారు. కార్మిక మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం, ప్రస్తుతం మొత్తం 31.86 లక్షల ఇన్ ఆపరేటివ్ ఖాతాల్లో రూ.10,903 కోట్లు మూలుగుతున్నాయి. అందులో రూ.1000 కన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాల్లో రూ.3.52 కోట్లు ఉన్నాయి.ఈ సొమ్ము ఆధార్ తో అనుసంధానమైన ఉన్న పీఎఫ్ ఖాతాదారుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా జమ చేస్తారు. ఒకవేళ ఖాతాదారుడు మరణిస్తే, ఆ మొత్తాన్ని నామినీకి లేదా చట్టబద్ధమైన వారసుడికి అందజేస్తారు.

ఈపీఎఫ్ఓ 3.0

పీఎఫ్ ఖాతాలను ప్రక్షాళన చేసే క్రమంలో భాగంగా, కార్మిక మంత్రిత్వ శాఖ ఈపీఎఫ్ ఓ 3.0 అనే డిజిటల్ ట్రాన్స్ ఫార్మేటివ్ ప్రాజెక్టుపై పనిచేస్తోంది. దీని ద్వారా కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ను తీసుకొచ్చి, ఖాతాదారులకు, సంస్థలకు బ్యాంకింగ్ తరహా సేవలందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల రిస్క్ మేనేజ్ మెంట్ క్లియరెన్స్ ఉన్న క్లెయిమ్ లు ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా 'ఆటో మోడ్ 'లో ప్రాసెస్ అవుతాయి. ఫలితంగా ఇప్పటి వరకు 20 రోజులు పడుతున్న క్లెయిమ్ సెటిల్ మెంట్ సమయం, ఏకంగా 3 రోజులలోపునకు తగ్గిపోతుంది. మరీ ముఖ్యంగా పీఎఫ్ ఖాతాదారులు ఒకే వేదిక నుంచి తమ సామాజిక భద్రతా ఖాతాలను (సోషల్ సెక్యూరిటీ అకౌంట్స్ ) నిర్వహించుకోవడానికి వీలవుతుంది. పేపర్ వర్క్ కూడా తగ్గుతుంది. ప్రస్తుతం పీఎఫ్ ఖాతాదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి ఈపీఎఫ్ ఓ క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. అయలా కొత్త ఫీచర్ల పనితీరును పర్యవేక్షిస్తోంది. లిచిపోయిన అన్ని ఖాతాలను దశలవారీగా సెటిల్ చేసి, అర్హులైన లబ్ధిదారులకు వారి సొమ్ము అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో కొత్త యాప్

ఈపీఎఫ్ ఓ తమ ఖాతాదారుల కోసం త్వరలో కొత్త యాప్ తెచ్చేందుకు సిద్ధమైంది. దీని వల్ల అత్యవసర సమయాల్లో పీఎఫ్ డబ్బులు తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే పనిలేకుండా, క్షణాల్లోనే డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్తగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా, 'యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్' సాయంతో పీఎఫ్ ఖాతాదారులు తమ డబ్బును నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకోవచ్చు.

ఫీచర్స్ అదుర్స్

కొత్త యాప్‌లో ఖాతాదారులు తమ అకౌంట్‌లో ఎంత బ్యాలెన్స్ ఉందో చూసుకోవచ్చు. అందులో ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత ఉందో చూడవచ్చు. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన యూపీఐ పిన్ ఉపయోగించి, సురక్షితంగా ఆ డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. పాస్‌బుక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, ఇతర సేవలు కూడా మరింత సులభతరం అవుతాయి. పాత పద్ధతిలోలాగా క్లెయిమ్ ఫారం నింపి, అప్లై చేసే తిప్పలు తప్పుతాయి. ఈ కొత్త విధానం ఎలా పనిచేస్తుందో చూడడానికి ఈపీఎఫ్ఓ సుమారు 100 డమ్మీ ఖాతాలతో ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఇందులో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్‌లో ఈ యాప్‌ను ఘనంగా ప్రారంభించేందుకు కేంద్ర కార్మిక శాఖ సన్నాహాలు చేస్తోంది.

# నెలసరి ఆలస్యమవుతోందా - ఇవి చెక్ చేసుకోవాలంటున్న నిపుణులు!

## రుతు క్రమంలో ఇబ్బందులకు మానసిక ఒత్తిడితోపాటు అధిక వ్యాయామమూ కారణం కావొచ్చట!



నెలసరి కొన్నిసార్లు ముందుగా లేదంటే ఆలస్యంగా రావడం మామూలే! అయితే, కొంతమందిలో ప్రతిసారీ ఇలాగే జరుగుతుంటుంది. హార్మోన్ల అసమతుల్యతే దీనికి కారణమనుకుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. జీవనశైలి మార్పులు, పలు ఆరోగ్య సమస్యలూ ఇందుకు కారణం కావచ్చని చెబుతున్నారు. అందుకే ప్రతి నెలా పిరియడ్స్ ముందుగా లేదంటే ఆలస్యంగా వస్తున్నట్లు గమనిస్తే, ఎవరికి వారే స్వయంగా కొన్ని ప్రశ్నలు వేసుకోవాలని పేర్కొంటున్నారు. తద్వారా అసలు సమస్యేంటో గుర్తించి, మొదట్లోనే డాక్టర్‌ని సంప్రదించి చికిత్స తీసుకోవచ్చని సూచిస్తున్నారు. మరి, మిమ్మల్ని మీరు అడగాల్సిన ప్రశ్నలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఒత్తిడికి గురవుతున్నానా :

ప్రస్తుతం చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురవడం, ఆందోళన చెందడం చాలామందిలో కనిపిస్తుంది. అయితే, ఇలా ఒత్తిడికి గురైన ప్రతిసారీ శరీరంలో కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇది ఇతర హార్మోన్ల స్థాయుల పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో నెలసరిని క్రమబద్ధీకరించే ల్యుటినైజింగ్, ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్, ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్ల స్థాయులు అదుపు తప్పుతాయని పేర్కొంటున్నారు. దీని ప్రభావం నెలసరిపై పడి.. తద్వారా ఇర్రెగ్యులర్ పిరియడ్స్‌కు దారితీస్తుందని తెలియజేస్తున్నారు. కాబట్టి నెలనెలా పిరియడ్స్ ఆలస్యమైతే.. 'తాము ఏ విషయంలోనైనా టెన్షన్ పడుతున్నామా అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలని సూచిస్తున్నారు. ఫలితంగా మీ ఇర్రెగ్యులర్ పిరియడ్స్‌కి ఒత్తిడి కారణమా కాదా అనేది తెలుస్తుందని సలహా ఇస్తున్నారు. ఒత్తిడి.. రుతు చక్రంపై ప్రభావం చూపుతుందని ఎశ్రీవజవశ్రీఖఅనఎశ్రీఅఅఅఎ అధ్యయనం పేర్కొంది.

డైటింగ్ వల్లా :

శరీరానికి పోషకాలన్నీ అందినప్పుడే హార్మోన్లు సక్రమంగా పని చేస్తాయి. కానీ, కొందరైతే డైటింగ్ పేరుతో కడుపు మాడ్చుకుంటారు. దీనివల్ల శరీరానికి సరిపడా పోషకాలు, క్యాలరీలు అందవట. దీనివల్ల కూడా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ వంటి ప్రత్యుత్పత్తి హార్మోన్ల అసమతుల్యత తలెత్తుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇదీ నెలసరి క్రమం తప్పడానికి, ఆలస్యంగా రావడానికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పిరియడ్స్ ప్రతి నెలా ఆలస్యమవుతుంటే.. తాము డైట్‌లో ఏవైనా మార్పులు చేసుకున్నామా? క్యాలరీల్ని తగ్గించామా అనే దిశగానూ ఆలోచించాలంటున్నారు. ఋతుక్రమ రుగ్మతలు ఉన్న మహిళలు అధిక చక్కెర కలిగిన ఆహారాలు లేదా పానీయాలను ఎక్కువగా తీసుకుంటారని, తగినంత పోషకాలు తీసుకోరని అధ్యయనం పేర్కొంది.

వ్యాయామం మితిమీరిందా :

మామూలుగా వర్కవుట్ రొటీన్ ప్రారంభించే వారు తక్కువ తీవ్రత ఉన్న సింపుల్ ఎక్సర్ సైజ్ లతో స్టార్ట్ చేస్తారు. కానీ, కొంతమంది త్వరగా బరువు తగ్గాలని మొదట్లోనే అధిక తీవ్రత ఉన్న వ్యాయామాల్ని రొటీన్‌లో చేర్చుకుంటారని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు ఆహారం కూడా సరిగ్గా తీసుకోరని చెబుతున్నారు. ఫలితంగా, శరీరం శక్తి స్థాయుల్ని కోల్పోతుందంటున్నారు. ఇది పిరియడ్స్ పై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలియజేస్తున్నారు. తద్వారా నెలసరి ఆలస్యమవడం, కొంతమందిలో ఆగిపోవడం కూడా జరుగుతుందంటున్నారు. అంతేకాదు, ఉన్నట్లుండి బరువు తగ్గినా, పెరిగినా కూడా పిరియడ్స్ సమస్యలు తప్పవంటున్నారు. నెలసరిని క్రమబద్ధీకరించే ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు ప్రధాన కారణమట! కాబట్టి, నెలసరి ఆలస్యమైతే మీ శారీరక బరువు, వ్యాయామాల విషయాల్లోనూ ఈ ప్రశ్నలు సంధించుకోవడం వల్ల అసలు కారణమేంటో ఓ అవగాహన వస్తుందని పేర్కొంటున్నారు. క్రమరహిత రుతుస్రావానికి అధిక వ్యాయామం కూడా ఒక కారణమని అఱఎష్ట్రస.అఱష్ట్ర.స్త్రశీఙ అధ్యయనం పేర్కొంది.

మందుల ప్రభావమేమో :

దీర్ఘకాలం మందులు వాడే వారు, వాటిని మార్చినా మొదట్లో కొన్నాళ్ల పాటు నెలసరి అదుపు తప్పడం గమనిస్తుంటాం. ముఖ్యంగా, గర్భ నిరోధక మాత్రలు, ఒత్తిడిని తగ్గించే మందులు, థైరాయిడ్–స్థూలకాయానికి సంబంధించిన మందులు, కొన్ని రకాల నొప్పి నివారిణులు కూడా నెలసరిపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయంటున్నారు నిపుణులు. అంతేకాదు, రక్తస్రావంలోనూ హెచ్చుతగ్గులొస్తాయని చెబుతున్నారు. అందుకే పిరియడ్స్ విషయంలో మార్పులేవైనా గమనిస్తే, 'నేను వాడే కొత్త మందుల వల్లే ఇలా జరుగుతోందేమో'నని ఒకటికి రెండుసార్లు ప్రశ్నించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

నిద్ర సరిపోతోందా :

పని ఒత్తిడి, షిఫ్టుల వల్ల ఇప్పుడు చాలామంది ప్రశాంతమైన నిద్రకు నోచుకోలేకపోతున్నారు. దీని ప్రభావం ఆరోగ్యంపై పడుతుందంటున్నారు నిపుణులు. తద్వారా బరువు పెరగడం, ఒబెసిటీ, పీసీఓఎస్ వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో దీర్ఘకాల నిద్రలేమి రుతుచక్రం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. కాబట్టి, నెలసరి అదుపు తప్పినప్పుడు నిద్ర విషయంలోనూ ఎవరికి వారు కొన్ని ప్రశ్నలు వేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు. తమ జీవనశైలి మార్పుల విషయంలో ఇలా ఎవరికి వారే స్వీయ పరిశీలన చేసుకోవడం వల్ల నెలసరి ఆలస్యానికి గల కారణాలేంటో తెలుస్తాయంటున్నారు నిపుణులు. ఇవన్నీ డాక్టర్ ముందుంచితే మీ సమస్యకు తగిన చికిత్స అందించడం సులువవుతుందని చెబుతున్నారు. ఫలితంగా, నెలసరి క్రమంగా వస్తుందని, ఆరోగ్యపరంగానూ మేలు జరుగుతుందట. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## జడ్పీహెచ్ఎస్‌లో విజ్ఞాన శాస్త్ర గది ఆవిష్కరణ...



నాగర్ కర్నూల్ టౌన్ //**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినపల్లి మండల పరిధిలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజ్ఞాన శాస్త్ర గది (సైన్స్ ల్యాబ్)ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పట్ల అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. నమూనాలు, చార్టులు, వివిధ శాస్త్ర పరికరాలు, యంత్రాలను అమర్చి వాటి పనితీరును విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే విధంగా సౌకర్యాలు కల్పించారు. బోధనకు అనుకూలంగా ల్యాబ్‌ను రూపొందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనోద్దీన్, సైన్స్ ఉపాధ్యాయులు పూర్ణచంద్రశేఖర్, రాజు, రాఘవేందర్, వెంకట్ నర్సమ్మతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సిబ్బంది మరింత మెరుగ్గా పనిచేయాలి...

### నగర మేయర్ మహంకాళి స్వామి...



గోదావరిఖని టౌన్//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : స్వచ్ఛ రామగుండం గా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య సిబ్బంది మరింత మెరుగ్గా పని చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సానిటేషన్ సిబ్బంది,వాహనాలు సక్రమంగా సద్వినియోగం చేసుకొని గృహస్తులు చెత్త బయట పడ వేయకముందే సేకరించాలని అన్నారు.రోజు విడిచి రోజు తప్పని సరిగా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించాలని అన్నారు.మురుగు నీటి కాలువలను నిర్ణీత కాల వ్యవధి లో తప్పకుండా శుభ్రం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.రామన్,డి.ఇ. శాంతి స్వరూప్,సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, సంపత్,సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం...

### గోదావరిఖని వన్ సీఐ ఇంద్రసేనారెడ్డి...



గోదావరిఖని//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో డ్రైవర్ల బాధ్యత అత్యంత కీలకమని గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు "అరైవ్ అలైవ్" రెండో విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోదావరిఖని లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో సుమారు 100 మంది లారీ డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. డ్రైవర్లలో చూపు సమస్యలు ఉన్నాయా లేదా అన్న అంశంపై వైద్యులు సమగ్రంగా పరిశీలించి అవసరమైన వారికి వైద్య సూచనలు అందించారు. కంటి చూపు సరిగా లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా కంటి పరీక్షలను నిరంతరం చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో చూపు లోపాలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతాయని, కాబట్టి డ్రైవర్లు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలను పాటించాలని సూచించారు.ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం, మసక చూపు లేదా తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం, రాత్రి డ్రైవింగ్ సమయంలో హైబీమ్ లైట్లను నేరుగా చూడకపోవడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు. డాక్టర్ సూచించిన పవర్ గ్లాసెస్ మాత్రమే ఉపయోగించాలి, పాత లేదా స్క్రాచ్ అయిన కళ్లజోడును వెంటనే మార్చుకోవాలి అన్నారు.అలాగే ప్రతి రెండు నుంచి మూడు గంటలకు డ్రైవింగ్ మధ్యలో 10 నిమిషాల విరామం తీసుకోవడం, కళ్లలో పొడిబారడం ఉంటే అవసరమైతే ఐ డ్రాప్స్ వాడడం, విటమిన్-ఏ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వంటి అలవాట్లు పాటించాలని తెలిపారు. షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్న వారు కంటి పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. పొగ త్రాగడం, మద్యం అలవాట్లు తగ్గించుకోవడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, కంటి వైద్యుడు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల కృతజ్ఞత సదస్సు విజయవంతం చేయాలి జ్యోతి రెడ్డి




మంథని//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సదస్సు మార్చి 1న కరీంనగర్లో నిర్వహించే సందర్భంగా ఈ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి పిలుపునిచ్చారు. మంథని డివిజన్ ప్రెస్ క్లబ్లో మంథని నియోజక వర్గం ఇంచార్జ్ గోగుల రాజు రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇవ్వడం హర్షనీయమని, తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్స్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వని కోరారు. ఈ కార్యక్రమం టీయూఫ్ నాయకుల నిర్వహించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నూనె రహస్యం మంథని విజయ్ కుమార్ గుర్రం దేవేందర్ రాష్ట్ర కార్యదర్శి భక్తుల శంకర్ మంథని మండల అధ్యక్షుడు కాసిపేట సాంబయ్య ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య ఉపాధ్యక్షుడు కొండల సమ్మయ్య సీనియర్ ఉద్యమ నాయకుడు దొడ్డ లింగయ్య జమ్మిడి కొండయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సదస్సుకు భారీ ర్యాలీ..

### ఉద్యమకారులు పెద్దఎత్తున తరలిరావాలని గుండేటి ఐలయ్య యాదవ్ పిలుపు..



ఓదెల//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయడానికి తెలంగాణ ఉద్యమకారులు పెద్దఎత్తున పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఫిలిం భవన్ వరకు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు తదితర ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతూ పెద్దపల్లి జిల్లా ఉద్యమకారులందరూ ఉదయం 9 గంటలకే సదస్సు ప్రాంగణానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో కొలనూర్ మాజీ సర్పంచ్ ఢిల్లీ శంకర్, రాష్ట్ర కార్యదర్శి కందుల సదాశివు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బింగి రాజు, చర్లపల్లి సురేష్ గౌడ్, పిడుగు కృష్ణ, గోగుల రాజిరెడ్డి, దుబ్బెడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీలో ప్రోటోకాల్ ఉల్లంఘన వివాదం

### సీఎం ఫోటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు కలకలం...

చేర్యాల//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : సిద్ధిపేట జిల్లాలోని చేర్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ పాలకవర్గ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకోవడం వివాదానికి దారితీసింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో లేకపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో విషయం మరింత వేడెక్కింది.చేర్యాల మున్సిపల్ కార్యాలయం పరిధిలో జరిగిన పాలకవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సందర్భంగా అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు కార్యక్రమానికి ముందు నుంచే ప్రతిష్టాత్మకంగా సిద్ధం చేయబడ్డాయి. అయితే ఆ ఫ్లెక్సీలలో ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడం ప్రభుత్వ ప్రోటోకాల్‌ను విస్మరించినట్లుగా భావించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమం నిర్వహణలో రాష్ట్ర ప్రధాన నేతకు తగిన గౌరవం ఇవ్వకపోవడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు.స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించి వెంటనే అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో సీఎం ఫోటో తప్పనిసరిగా ఉండాలని, అది ప్రోటోకాల్‌లో భాగమని గుర్తుచేశారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, రాజకీయంగా ఇది అనుచితమైన చర్యగా భావించవచ్చని పేర్కొన్నారు. సంఘటన స్థలంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.విషయం బయటపడగానే మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. వివాదానికి కారణమైన ఫ్లెక్సీని వెంటనే తొలగించారు. తదుపరి కార్యక్రమం సజావుగా




కొనసాగేందుకు కొత్త ఫ్లెక్సీ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ మొదట జరిగిన పొరపాటు కారణంగా అధికారులు విమర్శల పాలయ్యారు.ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించక పోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతిన్నదని ఆరోపించారు. మరోవైపు మున్సిపల్ వర్గాలు మాత్రం ఇది ఉద్దేశపూర్వకంగా జరిగినది కాదని, సాంకేతిక లోపం వల్ల ఫ్లెక్సీ రూపకల్పనలో తప్పిదం జరిగిందని వివరణ ఇచ్చాయి. కార్యక్రమం అత్యవసరంగా నిర్వహించాల్సి రావడంతో తొందరపాటులో ఈ పొరపాటు జరిగిందని పేర్కొన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ప్రోటోకాల్ అమలు అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర నాయకత్వానికి గౌరవం ఇవ్వడం, ప్రభుత్వ చిహ్నాలు, ప్రతినిధుల ఫోటోలు సముచితంగా ప్రదర్శించడం వంటి అంశాలు పరిపాలనా విధానంలో భాగమని వారు పేర్కొంటున్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో కూడా అధికారులకు ప్రోటోకాల్‌పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.చేర్యాల మున్సిపాలిటీలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై జిల్లా స్థాయి అధికారులు కూడా నివేదిక కోరినట్లు సమాచారం. బాధ్యులపై తగిన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఘటన స్థానికంగా చర్చకు దారితీస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో జాగ్రత్తలు ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేసింది.

# స్మశాన వాటికలో సోలార్ ప్రాజెక్టు రద్దు చేయాలి...

### పెద్దపల్లి జిల్లాలో సిపిఎం భారీ ధర్నా...

పెద్దపల్లిటౌన్//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో గత ఇరవై సంవత్సరాలుగా గ్రామ ప్రజలు వినియోగిస్తున్న స్మశాన వాటిక స్థలంలో సోలార్ ప్రాజెక్టును నిర్మించాలనే నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ స్మశాన వాటిక వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ప్రజా సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న స్మశాన భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ, రాఘవాపూర్ గ్రామంలోని అన్ని కులాల ప్రజలు గత రెండు దశాబ్దాలుగా ఒకే స్మశాన వాటికను వినియోగిస్తున్నారని, అలాంటి పవిత్రమైన స్థలాన్ని సోలార్ ప్రాజెక్టు పేరుతో తొలగించడం ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. గ్రామ ప్రజల పూర్వీకులు సమాధి చేయబడిన ప్రదేశాన్ని కూల్చివేయడం అత్యంత అమానుషమని, ఇది మానవత్వానికి విరుద్ధమని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.గ్రామ పరిధిలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ, కావాలనే స్మశాన వాటికను ఎంచుకోవడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల అవసరాలకు ఉపయోగపడే భూములను కాపాడాల్సిన అధికారులు, వాటిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు



తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండగా, స్మశాన వాటికపై మాత్రం అధికార ప్రతాపం చూపించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు.గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటిపై అధికారుల దృష్టి లేకపోవడం వల్ల ప్రజా వనరులు దోపిడీకి గురవుతున్నాయని, అయితే పేదల స్మశాన స్థలాన్ని మాత్రం లక్ష్యంగా చేసుకోవడం ప్రభుత్వ విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రజల జీవన హక్కులతో పాటు మరణానంతర గౌరవం కూడా సమానంగా ముఖ్యమని, స్మశాన వాటికను తొలగించడం ప్రజల గౌరవాన్ని అవమానించడం అవుతుందని అన్నారు.సోలార్ ప్రాజెక్టు పేరుతో ఇప్పటికే ఉన్న సమాధులను తొలగించే చర్యలను వెంటనే నిలిపివేయాలని, ఆ ప్రాజెక్టును ఇతర అనుకూలమైన ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణం స్పందించాలని, లేదంటే గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టును నిలిపివేయాలని, గ్రామ ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని, లేకపోతే నిరవధిక నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపడతామని సిపిఎం జిల్లా నాయకులు హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాన్ని విస్తరిస్తామని వారు తెలిపారు.ఈ ధర్నాలో సిపిఎం నాయకులు కుమ్మరి నవీన్, జిల్లాల ప్రశాంత్, కునుకుల సతీష్, కుమార్, సారయ్య, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. రాఘవాపూర్ గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు, యువకులు ఈ ఆందోళనలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. గ్రామ స్మశాన వాటికను కాపాడాలని నినాదాలు చేస్తూ ప్రజలు తీవ్రంగా స్పందించారు.ప్రస్తుతం ఈ అంశం పెద్దపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే దానిపై అందరి దృష్టి నిలిచింది.

## రెండు నెలల పసిబిడ్డ మృతి ఘటన దురదృష్టకరం...

### బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని నేతల స్పష్టం...



నాగర్ కర్నూల్//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పరిధిలోని కుమ్మెర గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న రెండు నెలల పసిబిడ్డ మృతి ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై రాజకీయ, సామాజిక వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. పసిపాప మృతి పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.ఈ ఘటనపై పూర్తి స్థాయి నిజ నిర్ధారణ కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయబడింది. ఈ బృందం నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలతో సమావేశమై సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించింది. బాధిత కుటుంబ సభ్యుల వేదనను ఆత్మీయంగా తెలుసుకొని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, పసిపాప మరణం వంటి దుర్ఘటనను రాజకీయంగా ఉపయోగించుకోవడం సమాజానికి అనర్థమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు నిజాలు వెలుగులోకి వచ్చే వరకు ఎవరినీ కాపాడబోమని, నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ పర్యటనలో జాతీయ ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అలాగే టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా పోత్వల్, డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, పలువురు సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో జరిగిన సమావేశంలో పసిపాప మృతి వెనుక ఉన్న కారణాలను లోతుగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.గ్రామ ప్రజలు ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారగా, ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నేతలు, అధికారులు కలిసి నిజానిజాలను వెలికితీసి, పాప మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## జడ్చర్లలో పట్టపగలే చైన్ స్నాచింగ్....

### సీసీ కెమెరాల్లో దుండగుల కదలికలు రికార్డు...




జడ్చర్ల//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో పట్టపగలే చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు కృష్ణారెడ్డి నగర్ కాలనీలో నివసిస్తున్న మంజుల అనే మహిళ తన ఇంటి వద్ద కిరాణా దుకాణంతో పాటు టైలరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది.రోజు వారీ వ్యాపార పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలోనే దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడటం భయాందోళనలకు దారితీసింది. సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్న సమయంలో బైక్‌పై ముగ్గురు వ్యక్తులు మంజుల దుకాణం వద్దకు చేరుకున్నారు. వారు సాధారణ కస్టమర్లలా ప్రవర్తిస్తూ వాటర్ బాటిల్ కావాలని అడిగారు. మంజుల వారికి నీళ్లు అందించేందుకు ముందుకు వచ్చి బాటిల్ అందిస్తున్న సమయంలో ఒక్కసారిగా దుండగుల్లో ఒకరు ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును బలవంతంగా లాగి తీసుకున్నాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటనతో మంజుల షాక్‌కు గురైంది.దుండగులు చైన్ లాక్కొన్న వెంటనే బైక్‌పై వేగంగా అక్కడి నుంచి పరారయ్యారు. మంజుల వెంటనే బయటకు పరుగెత్తి కేకలు వేస్తూ సహాయం కోసం అరిచినా అప్పటికే వారు దూరమయ్యారు. ఈ సంఘటనతో కాలనీలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా బయటకు వచ్చి పరిస్థితిని గమనించారు. పట్టపగలే ఇలా మహిళ మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కోవడం స్థానికుల్లో భయాన్ని నింపింది.ఈ ఘటన మొత్తం సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు కావడం పోలీసులకు కీలక ఆధారంగా మారింది. దుండగుల ముఖాలు, వారి బైక్ నంబర్ ప్లేట్, దుస్తులు వంటి వివరాలు స్పష్టంగా కెమెరాల్లో కనిపిస్తున్నాయని సమాచారం. ఈ దృశ్యాలను ఆధారంగా చేసుకొని నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. బాధితురాలు మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచి అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించి, దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.పట్టపగలే జరిగిన ఈ చైన్ స్నాచింగ్ ఘటనతో మహిళలు, వ్యాపారులు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పట్టణ ప్రాంతాల్లో ఇటువంటి సంఘటనలు పెరుగుతున్నాయని, పోలీసు పహారా మరింత బలపడాలని స్థానికులు కోరుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వీధి దీపాల వెలుగు, రాత్రి పహారా వంటి అంశాల్లో మరింత శ్రద్ధ వహించాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.పోలీసులు త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకొని బంగారు ఆభరణాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కుమ్మెర ఘటనలో నిందితుల అరెస్ట్, సర్పంచ్ భర్తరఫ్...

### ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయాలని డిమాండ్...



నాగర్ కర్నూల్//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష :** కుమ్మెర గ్రామంలో జరిగిన ఘర్షణ ఘటనపై నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, గ్రామ సర్పంచ్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, గ్రామంలోని ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయాలని కుమ్మెర బాధితుల న్యాయ పోరాట ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 18న జరిగిన ఘటనకు సంబంధించి నేటి వరకు నిందితులు అరెస్టు కాకపోవడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ప్రధాన చానళ్ల జర్నలిస్టులను అరెస్ట్ చేసే స్థాయిలో పని చేసే తెలంగాణ రాష్ట్ర పోలీసులు గ్రామానికి చెందిన నిందితులను పట్టుకోలేకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నిందితులు ఎక్కడ ఉన్నా వెంటనే అరెస్ట్ చేసి పోలీసులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు డిమాండ్ చేశారు.అలాగే గ్రామంలో వివాదానికి కారణమైన ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆలయం ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే పేద ప్రజలు ఎలాంటి ఆధిపత్య కులాల ఒత్తిడులు లేకుండా స్వేచ్ఛగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర ద్వారా వస్తున్న ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సర్పంచ్ తూకారం రెడ్డిపై నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుని పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బోనాసి రాంచందర్ అడ్వకేట్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీను, కొళ్ళ శివ, శివశంకర్ యాదవ్, కరిగళ్ళ దశరథం, పృథ్వీరాజు, తుప్పల రాజు, పరుశరామ్, శాలిశ్వర్, అంతటి కాశన్న, నాగపూరి మధు, పొదిల రామయ్య, అశోక్, కొత్త దినేష్, నవీన్, మద్దిలేటి హర్ష, కళ్యాణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.ం



## గోదావరిఖని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతం...

### కార్పొరేటర్ కొలాని కవితకు ఘన సన్మానం...



గోదావరిఖని//**ఫిబ్రవరి 27 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 24వ డివిజన్ ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో ఉన్న డీ టైపు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 24వ డివిజన్ కార్పొరేటర్ కొలాని కవిత ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీ స్త్రీలకు ఆశీర్వాదాలు అందించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. గర్భిణీలు ఆరోగ్య నియమాలను పాటిస్తూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సుజాత నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ కొలాని కవితను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటీని ఏర్పాటు చేసి, కమిటీ చైర్మన్‌గా కొలాని కవితను ఎన్నుకోగా సభ్యులుగా భూలక్ష్మి, స్వాతి, రావుల సుజిత, సంతోషి, మౌనిక, స్రవంతి, సుజాతలను నియమించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవకులు జనగామ తిరుపతి, ఆయా పుష్పలీల, ప్రత్యుష, అంజు, రజిత, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అంతటా సాంప్రదాయ వాతావరణంలో మహిళలు పాల్గొని గర్భిణీలకు మంగళహారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది గర్భిణీలకు పోషకాహార కిట్లు అందజేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు పొందింది.



## ఆర్డీవో కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై మానసిక వేధింపులు...



నర్సాపూర్//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : ఎలక్షన్ డ్యూటీలో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఎలక్షన్ ఆపరేటర్ ఎం. రాజ్‌కుమార్ తనపై డిప్యూటీ తహసిల్దార్ విజయలక్ష్మి మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఆర్డీవో కార్యాలయంలో ఎలక్షన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నానని, అయినప్పటికీ ఉద్యోగ రీత్యా ఔట్‌సోర్సింగ్ అనే కారణంతో తనను చిన్న చూపు చూస్తున్నారని ఆయన ఆరోపించారు. గత నాలుగు నెలలుగా నయాబ్ తహసిల్దార్ విజయలక్ష్మి తనను పలుమార్లు అందరి ముందు అవహేళన చేస్తూ తిట్టిపోస్తున్నారని, తాను చేయని పనులకూ బాధ్యత మోపుతూ తనపై చెడు ప్రచారం చేస్తున్నారని రాజ్‌కుమార్ వాపోయారు. పై అధికారిగా ఉండి తన స్థాయిని మరిచి ఇలా వ్యవహరించడం తనకు, తన కుటుంబానికి తీవ్ర మానసిక ఒత్తిడిని కలిగిస్తోందని తెలిపారు.ఇటీవల రెండు నెలల క్రితం 10 రోజుల సెలవు తీసుకున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని, విధి నిర్వహణలో తాను సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ అనవసరంగా టార్గెట్ చేస్తూ బాధిస్తున్నారని పేర్కొన్నారు. తన పనికి సంబంధం లేని పనులను కూడా చేయించాలని ఒత్తిడి తెస్తున్నారని, అంతేకాకుండా చిన్న చిన్న విషయాలకూ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పరిచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.ఈ సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని, ఇక తాను ఈ వేధింపులు తట్టుకోలేక రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.ఈ వ్యవహారం ఆర్డీవో కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు దీనిపై విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ఉద్యోగులు, స్థానికులు కోరుతున్నారు.

## విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్...

### సౌమ్య కుటుంబానికి అండగా విశ్రాంత ఉద్యోగులు....

### రూ.2.80 లక్షల చెక్కు అందజేత...



హైదరాబాద్//ఫిబ్రవరి 27(ఆకాంక్ష ) : విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించి, మొత్తం రూ.2.80 లక్షల చెక్కును అందజేశారు. ఈ చెక్కును రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. విధి పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. వారికి అన్నివేళలా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యం పై ఉక్కుపాదం మోపుతామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, సౌమ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బందిని స్మరించుకుంటూ వారికి అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యులు చురుకుగా పనిచేయాలి....

### ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు...



నల్గొండ//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కట్టంగూర్ ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు సూచించారు. గత ఐదు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రెండో విడత శిక్షణ కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థలపై సభ్యులకు సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించడం, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం, పారిశుధ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడం, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించడం వంటి అంశాలపై శిక్షణలో వివరంగా తెలియజేశామని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాలను అర్థం చేసుకొని వారితో నిరంతరం మమేకమై పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంత మవుతుందని ఆయన సూచించారు. వార్డు సభ్యులు గ్రామ స్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వంతెనలా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం శిక్షణ పూర్తి చేసిన వార్డు సభ్యులకు ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి స్వరూపారాణి, మండల పరిషత్ పర్యవేక్షకులు చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ అశోక్, టీఓటీలు వెంకన్న, మల్లేష్, నర్సింహ్మా, స్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో "అర్రైవ్ అలైవ్ 2026" కార్యక్రమం...




గోదావరిఖని టౌన్, ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పరిధిలో రహదారి భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా "అరైవ్ అలైవ్ 2026" కార్యక్రమం భాగంగా ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 22 నుండి 28 వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు.కమిషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. లైన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు సహా సుమారు 200 మంది డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయి (షుగర్), రక్తపోటు (బీపీ) పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవడం కోసం ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, అలాంటి చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ తన ప్రాణ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా గౌరవిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామగుండం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. రాజేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్లు జి. హరి శేఖర్, ఎన్. రామరాజు తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఈ శిబిరం నిర్వహణలో చురుకైన పాత్ర పోషించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు డ్రైవర్లు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయ విజయం తర్వాత తెలంగాణలో కొత్త రాజకీయ ప్రస్థానం...

రాష్ట్ర రాజకీయాల్లో ఒక శక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో కవిత వ్యూహాలు..

నిర్దోషిగా తేలిన తర్వాత తెలంగాణలో కవిత కొత్త రాజకీయ శకం ప్రారంభం...

మహిళలు, యువత, రైతులను కేంద్రీకరిస్తూ కొత్త రాజకీయ వేదికకు శ్రీకారం....

ఆరోపణల నుంచి విముక్తి పొందిన తర్వాత కొత్త పార్టీ ఏర్పాటుకు కవిత దూకుడు...

పాత రాజకీయాలకు ప్రత్యామ్నాయం అంటూ కొత్త సిద్ధాంతాలతో ముందుకు వస్తున్న కవిత

కీలక నేతలతో చర్చలు, గోప్య సమావేశాలతో పార్టీ నిర్మాణంపై వేగం...










తెలంగాణబ్యూరో//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మాజీ ఎమ్మెల్సీగా ఉన్న కల్వకుంట్ల కవితకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. దర్యాప్తు పూర్తయి, కోర్టు విచారణ అనంతరం ఆమెపై ఉన్న అభియోగాలకు తగిన ఆధారాలు లేవని స్పష్టమవడంతో కేసును ముగిస్తూ కోర్టు నిర్ణయం వెలువరించడం తెలంగాణతో పాటు దేశ రాజకీయాల్లో పెద్ద చర్చగా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ భవిష్యత్తుపై, తెలంగాణలో ఆమె చేపట్టబోతున్న కొత్త రాజకీయ యత్నాలపై ప్రభావం చూపే అంశంగా మారింది.ఢిల్లీ ప్రభుత్వం అమలు చేసిన కొత్త మద్యం విధానం నేపథ్యంలో ప్రారంభమైన ఈ కేసులో మొదట అవకతవకలు, లైసెన్సుల మంజూరులో అక్రమాలు, లాబీయింగ్, భారీ ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేసును నమోదు చేసిన ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్లు పలు నెలల పాటు విచారణ జరిపాయి. పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకులు, మధ్య వర్తులను విచారించి సాక్ష్యాలు సేకరించాయి. ఈ దర్యాప్తులో భాగంగా కవిత పేరు ముందుకు రావడంతో ఆమెను పలుమార్లు విచారించారు. ఆమెపై "సౌత్ గ్రూప్" అనే వ్యాపార వర్గంతో కలిసి లాబీయింగ్ చేసి లైసెన్సులు పొందేందుకు సహకరించారనే ఆరోపణలు చేశారు.అయితే ఈ ఆరోపణలను ఆమె మొదటి నుంచే ఖండిస్తూ వచ్చారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్య అని, తెలంగాణ రాజకీయాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ కేసు పెట్టారని ఆమె ఆరోపించారు.దర్యాప్తు ప్రక్రియలో భాగంగా కవిత అరెస్టు కావడం, జైల్లో ఉండడం, బెయిల్ కోసం న్యాయ పోరాటం చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ సమయంలో తెలంగాణలో ఆమెకు మద్దతుగా పెద్ద ఎత్తున నిరసనలు, ర్యాలీలు జరిగాయి.ఆమె కుటుంబ సభ్యులు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ కేసును రాజకీయ ప్రతీకారంగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆమెకు మద్దతు పెరిగింది.తదుపరి దశలో దర్యాప్తు సంస్థలు కోర్టులో సమర్పించిన సాక్ష్యాలు, పత్రాలు పరిశీలించిన తర్వాత కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కవితపై చేసిన ఆరోపణలకు తగిన బలమైన ఆధారాలు లేవని, ఆర్థిక లావాదేవీల్లో ఆమె ప్రత్యక్ష ప్రమేయం నిరూపించబడలేదని కోర్టు పేర్కొంది. దీంతో కేసులో ఆమెకు క్లీన్ చిట్ ఇస్తూ కేసును ముగించడంపై కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం రాజకీయంగా ఆమెకు పెద్ద ఊరటగా మారింది.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణలో ఆమె అనుచరులు సంబరాలు జరిపారు.ఇది నిజం గెలిచిందనే సంకేతమని వారు పేర్కొన్నారు. కవిత కూడా కోర్టు తీర్పును స్వాగతిస్తూ, తాను మొదటి నుంచే నిర్దోషినని చెప్పినది నిజమైందని ప్రకటించారు. న్యాయవ్యవస్థపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఆమె తెలిపారు.ఈ పరిణామం తరువాత కవిత రాజకీయంగా మరింత చురుకుదనాన్ని ప్రదర్శిస్తున్నారు. తెలంగాణలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ, మహిళల సమస్యలు, యువత ఉపాధి, రైతుల కష్టాలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై ఉద్యమాలు చేపడుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మార్పులు అవసరమని, ప్రజల ఆశలను నెరవేర్చే ప్రత్యామ్నాయ శక్తి అవసరమని ఆమె పేర్కొంటున్నారు.ఈ క్రమంలోనే కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారన్న సమాచారం మరింత బలపడుతోంది.ఇప్పటికే పలువురు నేతలతో చర్చలు జరిపిన ఆమె, తెలంగాణలో ఒక కొత్త రాజకీయ వేదికను నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మహిళలు, యువత, బీసీలు, ఎస్సీలు, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా పార్టీ నిర్మాణం ఉండబోతుందనే సంకేతాలు వస్తున్నాయి.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కవితకు క్లీన్ చిట్ రావడం ఆమెకు రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. గతంలో ఎదురైన ఆరోపణలు, జైలు జీవితం ఆమెకు ఒక పరీక్షగా మారగా, ఇప్పుడు కోర్టు తీర్పుతో ఆమెకు నైతిక బలం పెరిగింది. ఈ నేపథ్యంలో ఆమె కొత్త పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.ఇక రాష్ట్రంలో ఇప్పటికే ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రమైన నేపథ్యంలో, కవిత కొత్త పార్టీ రంగప్రవేశం చేస్తే రాజకీయ సమీకరణాలు మారే అవకాశముంది. ముఖ్యంగా మహిళలు, యువత, గ్రామీణ వర్గాల ఓటు బ్యాంకుపై ఈ పార్టీ ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితకు వచ్చిన క్లీన్ చిట్ ఆమె రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది. ఆరోపణలతో ప్రారంభమైన ఈ అధ్యాయం, జైలు జీవితం, న్యాయపోరాటం, చివరకు కోర్టు నిర్దోషిగా ప్రకటించడం వరకు జరిగిన పరిణామాలు ఇప్పుడు తెలంగాణలో కొత్త రాజకీయ దిశకు దారి తీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఆమె కొత్త పార్టీ ఎలా రూపుదిద్దుకుంటుందో, రాష్ట్ర రాజకీయాల్లో ఎలా ప్రభావం చూపుతుందో అన్నది ఆసక్తిగా మారింది.

## రామలింగాలపల్లి గ్రామంలో ప్రేమ వివాహం రక్తపాతం...

### యువకుడి కళ్లల్లో కారం కొట్టి కత్తితో పొడిచిన అమ్మాయి తరపు బంధువులు...

యాదాద్రి//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని రామలింగాలపల్లి గ్రామంలో ప్రేమ వివాహం వివాదం దారుణ ఘటనకు దారితీసింది. ప్రేమ వివాహం చేసుకున్నాడన్న కారణంతో అజయ్ అనే యువకుడిపై అమ్మాయి బంధువులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.గ్రామస్థుల వివరాల ప్రకారం, అజయ్ ఇటీవల తనకు నచ్చిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఈ విషయం అమ్మాయి కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన వారు అజయ్‌పై పగ తీర్చుకునేందుకు పథకం రచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రామలింగాలపల్లి గ్రామ పరిధిలో అజయ్‌ను అడ్డగించి దాడి చేశారు.దుండగులు అజయ్‌ను కత్తులతో పొడిచినట్లు, అదనంగా అతని కళ్లలో కారం పొడి కొట్టి మరింతగా హింసకు గురి చేసినట్లు సమాచారం. దాడి అనంతరం అజయ్ మృతిచెందినట్లు భావించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో అక్కడే రక్తపు మడుగులో పడి ఉన్న అజయ్‌ను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సమీప ఆసుపత్రికి తరలించారు.వైద్యులు అజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రేమ వివాహం కారణంగా జరిగిన ఈ దాడి స్థానికంగా భయాందోళనలకు దారితీసింది. బాధితుడి కుటుంబ సభ్యులు దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.పోలీసులు కేసు సంబంధిత వివరాలను సేకరిస్తూ, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజా యుద్ధ నౌక ప్రజాకవి గద్దర్ విగ్రహావిష్కరణ పోస్టర్ విడుదల...




జడ్చర్ల//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : ప్రజా యుద్ధ నౌకగా, ప్రజాకవిగా గుర్తింపు పొందిన గద్దర్ విగ్రహావిష్కరణ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శుక్రవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో పోస్టర్, కరపత్రాల విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్చి 8న కల్వకుర్తిలో జరగనున్న ఈ విగ్రహావిష్కరణ మహాసభకు సంబంధించి మిడ్జిల్ మండల ప్రజలకు విస్తృతంగా సమాచారం చేరేలా పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ జంగయ్య, బరిగెల బాలయ్య, భాగం శంకరయ్య, కేశమల్ల బిక్షపతి, కొట్టగారి శేఖర్, మావిళ్ళ వెంకటయ్య, బరిగెల బుచ్చయ్య, బరిగెల దేవయ్య, బర్గెల రమేష్, బర్గెల బాలస్వామి, వి.శంకర్ నాయక్, మామిడి అశోక్, కోడిగంటి నందం తదితరులు పాల్గొన్నారు. స్థానిక దళిత బహుజన సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ గద్దర్ అన్న గారు 1984 నుండి నేటి వరకు అణగారిన వర్గాల హక్కుల కోసం పాటల ద్వారా, ప్రజా ఉద్యమాల ద్వారా, బాటపట్టే పోరాటాల ద్వారా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని బలహీన వర్గాల సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చి, వారి గొంతుకగా నిలిచిన మహానేతగా గద్దర్ గుర్తింపు పొందారని పేర్కొన్నారు.మార్చి 8న కల్వకుర్తిలో జరగనున్న విగ్రహావిష్కరణ మహాసభకు పూర్వపు జిల్లా పరిధిలోని అన్ని తాలూకాలు, అన్ని మండలాల నుండి దళిత బహుజనులు, ప్రజా సంఘాల నాయకులు, యువత అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మిడ్జిల్ మండలం నుంచి కూడా భారీగా ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.గద్దర్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆలోచనలను సమాజంలో విస్తరించేందుకు ఈ విగ్రహావిష్కరణ మహాసభ ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెద్దపల్లి జిల్లా రేషన్ డీలర్ల ఆవేదన గళమెత్తింది...

### హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచిన సంఘం...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రధానంగా డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం చెల్లించాలని, గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర కమిషన్ల పేరుతో గందరగోళం సృష్టించకుండా ఒకే కమిషన్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా అభివృద్ధి చేసి తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. గత ఏడాది నుండి రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వమే తిరిగి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లందరికీ ఆరోగ్య భద్రత కల్పిస్తూ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కరోనా సమయంలో మరణించిన డీలర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అదనంగా షాపుల అద్దె, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం భరించాల్సిందిగా, వేబ్రిడ్జీల ఏర్పాటుతో పాటు హైదరాబాద్‌లో 'రేషన్ భవన్' నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆయన కోరారు. డీలర్లకు గౌరవం, భద్రత, స్థిరత్వం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే పౌర సరఫరా వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా మద్దెల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దొంకెన తిరుపతిగౌడ్ బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమంలో సంఘం నాయకులు రెడ్డిమల్ల హన్మాండ్లు, ఊక శేఖరరావు, చంద్రశేఖర్, పులిమామిడి లక్ష్మినారాయణ, కిరణ్ కుమార్ రెడ్డి, గాండ్ల రవికుమార్, చిలగాని మోహన్, పోతరాజు రమేష్, భానుచందర్ రావు, వెంకన్న, భాస్కర్ రెడ్డి, సందీప్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి...



మెదక్//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలం నిగజవాడ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు.గ్రామానికి చెందిన కుమ్మరి వెంకయ్య (65) శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందున్న రేకుల షెడ్డులో పనులు చేసుకుంటుండగా ప్రమాదం జరిగింది. బుట్టలో బ్రష్ తీసుకుంటున్న సమయంలో అనుకోకుండా విద్యుత్ తీగలకు స్పర్శ కలగడంతో అతనికి ఒక్కసారిగా కరెంట్ షాక్ తగిలింది. షాక్ తగిలి కింద పడిపోయిన వెంకయ్యకు తలకు తీవ్ర గాయమైంది.అతన్ని వెంటనే స్థానికులు చికిత్స కోసం తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిసింది. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ ఘటనపై స్పందించిన స్థానిక ఎస్సై పోచయ్య, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఉప్పల్‌లో వార్డు సభ్యుల మంత్రి మండలి ఏర్పాటు...

### సర్పంచ్ పోగుల మనీషా రాంబాబు వినూత్న నిర్ణయం...



ఉప్పల్//ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : గ్రామ పంచాయతీ వ్యవస్థలో సర్పంచ్ పాత్రను మరింత బలోపేతం చేస్తూ, గ్రామ అభివృద్ధికి నూతన దిశను నిర్దేశించేలా ఉప్పల్‌లో సర్పంచ్ పోగుల మనీషా రాంబాబు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. వార్డు సభ్యులతో కలిసి "మంత్రి మండలి" తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పాలనకు కొత్త బాటలు వేసారు.గ్రామంలో ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో, ప్రతి వార్డు సభ్యుడికి ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తూ ఈ మండలిని ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం, యువజనాభివృద్ధి వంటి విభాగాలను విభజించి, వాటికి బాధ్యత వహించేలా వార్డు సభ్యులను నియమించారు.ఈ విధానంతో గ్రామ పాలనలో సమూహ నాయకత్వం పెరుగుతుందని, ప్రతి సభ్యుడికి బాధ్యతతో కూడిన పాత్ర లభిస్తుందని సర్పంచ్ తెలిపారు. ప్రజల సమస్యలు సంబంధిత బాధ్యత వహించే సభ్యుడి దృష్టికి నేరుగా చేరడం వల్ల వాటి పరిష్కారం వేగంగా జరిగే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా ప్రజల భాగస్వామ్యాన్ని కూడా పెంచే ఈ మంత్రి మండలి వ్యవస్థ, పంచాయతీ రాజ్ వ్యవస్థ ఆత్మను ప్రతిబింబించేలా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పారదర్శకత, సమర్థత, సమన్వయం అనే మూడు ప్రధాన సూత్రాలపై ఈ వ్యవస్థ పనిచేయనున్నదని తెలిపారు.వార్డు సభ్యుల మంత్రి మండలి ఏర్పాటు ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని, ప్రజల నమ్మకం పెరుగుతుందని, వికేంద్రీకృత పాలనకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని సర్పంచ్ పోగుల మనీషా రాంబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.మొత్తంగా, ఈ వినూత్న నిర్ణయం గ్రామ పాలనలో ఒక కొత్త మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి దిశగా ఉప్పల్ ఆదర్శంగా నిలవనుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పర్యవేక్షణ...



మెదక్/ఫిబ్రవరి 27 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని, ప్రతి అంశాన్ని ముందస్తుగా పర్యవేక్షించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను అప్రమత్తం చేశారు.ఈ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్న దానిపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స మరియు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల రాకపోకలను నియంత్రించాలని పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మాల్‌ప్రాక్టీస్ నివారణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు.విద్యార్థులు పరీక్షలకు సమయానికి హాజరుకావడానికి రవాణా సౌకర్యాలపై కూడా దృష్టి పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని, ప్రశ్నాపత్రాల భద్రతకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

### గంగారం పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్

## 95వ వర్ధంతి ఘనంగా నిర్వహణ..




నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి శుక్రవారం బిజినపల్లి మండల పరిధిలోని గంగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొని ఆజాద్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమరంలో ఆజాద్ పోషించిన పాత్రను వివరించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్ వంటి మహనీయుల సహచరుడిగా ఆజాద్ నిర్భయంగా పోరాడారని అన్నారు. దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఆజాద్ జీవితగాథ భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. భారత మాత నుదుట సింధూరంగా నిలిచిన ఆజాద్ త్యాగం, పోరాటస్ఫూర్తి భారత చరిత్రలో ఎర్రసిరాలా నిలిచిందని ఆయన వివరించారు. "నా పేరు ఆజాద్, నా తండ్రి పేరు స్వాతంత్ర్యం, నా నివాసం జైలు" అని చెప్పిన ధైర్యవంతుడైన ఆజాద్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు.1928లో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ స్థాపనలో కీలకపాత్ర పోషించిన ఆజాద్, బ్రిటిష్ పాలనను భారతదేశం నుంచి తరిమివేయాలనే లక్ష్యంతో పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. శత్రువుల చేతిలో పడకుండా తానే తనను తాను ఆత్మార్పణం చేసుకున్న అమరవీరుడిగా ఆజాద్ భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నశేఖర్, కొముల‌య్య, శ్రీకాంత్ రెడ్డి, నందకిషోర్, ఇందుమతి తదితరులు పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు పాడి, ఆజాద్ జీవితం గురించి ప్రసంగాలు చేసి సభను ఆకట్టుకున్నారు.యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం జాతీయ గీతంతో ముగిసింది.

## విద్యా కమిషన్ నివేదికను వెంటనే రద్దు చేయాలి....

### స్టేట్ PRTUTS కన్వీనర్ కర్రు సురేష్ తీవ్ర ఆగ్రహం....



మంథని//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : ప్రభుత్వానికి సమర్పించిన విద్యా కమిషన్ నివేదికపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ వృత్తి పట్ల కుంచిత దృష్టితో రూపొందించిన ఈ నివేదికను పూర్తిగా ఖండిస్తున్నామని స్టేట్ ౹ా౼ఖూ కన్వీనర్ కర్రు సురేష్ తెలిపారు. విద్యారంగం వంటి కీలక రంగాన్ని ఆర్థిక లాభ నష్టాల కోణంలో చూడడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు.దేశ నిర్మాణంలో మానవ వనరులను తీర్చిదిద్దే గొప్ప బాధ్యతను నిర్వర్తించే ఉపాధ్యాయ వృత్తిని కార్పొరేట్ ఉద్యోగాలతో పోల్చడం సరికాదని, ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పడం, ప్రమోషన్లు ఇవ్వొద్దని సూచించడం వంటి అంశాలు కమిషన్ అవగాహన లోపాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో కూడా క్షేత్రస్థాయిలో అమలు చేయలేని విధానాలను ప్రతిపాదించడం ఈ నివేదికలోని అసంబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.నిర్మాణాత్మక ఆలోచనలతో కాకుండా విమర్శనాత్మక దృక్కోణంతో కమిషన్ నివేదిక తయారు చేయడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రమాదం ఉందని కర్రు సురేష్ హెచ్చరించారు. ప్రజా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా కాకుండా, దానిని బలహీనపరిచే విధంగా సూచనలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఈ విద్యా కమిషన్ నివేదికను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయి అనుభవం కలిగిన సీనియర్ ఉపాధ్యాయులు, విద్యా మేధావులు, నిపుణుల నుంచి సూచనలు సేకరించి కొత్త విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని కాపాడటమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యంతో ముందుకు రావాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

## స్త్రీనిధి బకాయిలపై డీఆర్‌డీఓ ఎం. కాళిందిని కఠిన హెచ్చరికలు...

### మార్చి 5లోపు 100 శాతం రికవరీ పూర్తి చేయాలని ఆదేశాలు...

### లక్ష్యం చేరుకోని సిబ్బందిపై వేతనాల నిలిపివేత, శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం...





పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : జిల్లాలో స్త్రీనిధి రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సిబ్బందిపై డీఆర్‌డీఓ ఎం. కాళిందిని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో తక్కువ ప్రగతి ఉన్న 116 మంది వీఓఏలు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, స్త్రీనిధి మేనేజర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని వీఓల వారీగా సమీక్షిస్తూ స్పష్టమైన సమాధానాలు కోరారు.మార్చి 5, 2026లోపు జిల్లాలో ఉన్న స్త్రీనిధి బకాయిలన్నింటినీ వసూలు చేసి 100 శాతం రికవరీ సాధించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా రుణ ప్రణాళికను కూడా పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని చేరుకోని పక్షంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 58 ప్రకారం సంబంధిత సిబ్బంది వేతనాలను నిలిపివేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా స్త్రీనిధి రీపేమెంట్ నిధులను ఎవరైనా దుర్వినియోగం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాళిందిని స్పష్టం చేశారు. రికవరీ సమయానికి పూర్తవుతేనే సభ్యులకు తిరిగి రుణాలు అందుతాయని, స్త్రీనిధి ద్వారా కేవలం 11 శాతం వడ్డీకే రుణాలు లభిస్తున్నాయని తెలిపారు. దీని వల్ల పేద మహిళలు ప్రైవేట్ మైక్రోఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ బారిన పడకుండా రక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.గ్రామ సంఘాల్లో ప్రతి నెలా డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ (డీసీబీ) వివరాలను క్రమంగా ఫైల్ చేయాలని, డ్యూ డేట్ కంటే ముందే వసూళ్లపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ రవీందర్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆర్. దుర్గాప్రసాద్, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు...





నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వసతి గృహ సంక్షేమాధికారి రాధ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యాధికారి డాక్టర్ వాణి పాల్గొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. వైద్య శిబిరంలో భాగంగా వసతి గృహంలో నివసిస్తున్న బాలికలందరికీ సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థిని యొక్క బరువు, రక్తపోటు, హిమోగ్లోబిన్ స్థాయిలు, సాధారణ శరీర పరిస్థితులను పరిశీలించారు. కొంత మంది విద్యార్థినులకు స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించి, అవసరమైన వారికి తక్షణ చికిత్స అందించారు. అవసరమైన మందులను కూడా అక్కడికక్కడే పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ వాణి మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంగా ఉండటమే వారి చదువులో విజయానికి ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం, సమయానికి నిద్రపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లు తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే వసతి గృహ నిర్వాహకులకు తెలియజేయాలని సూచించారు.వసతి గృహ సంక్షేమాధికారి రాధ మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి వైద్య శిబిరాలను తరచూ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త జి.జే. కవిత, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ సాయిశ్రీ, ఆశ కార్యకర్తలు ఖరున్నిసా, మానస, మహేశ్వరి, భాగ్యమ్మ, రేణుకలు చురుకుగా పాల్గొన్నారు. వారు విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, శుభ్రత, పోషకాహారం, వ్యాయామం వంటి అంశాలపై వివరణ ఇచ్చారు.వైద్య శిబిరం కారణంగా విద్యార్థినులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తమ ఆరోగ్య పరిస్థితి గురించి స్పష్టమైన అవగాహన లభించిందని, అవసరమైన మందులు కూడా అందించడంతో ఉపశమనం పొందామని తెలిపారు. ఇలాంటి శిబిరాలను తరచూ నిర్వహిస్తే తమ ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ విధంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరం విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, వారికి ఆరోగ్యంపై చైతన్యం కల్పించిన కార్యక్రమంగా నిలిచింది. అధికారులు, వైద్య సిబ్బంది కలిసి చేపట్టిన ఈ చర్యలు విద్యార్థినుల భవిష్యత్తు అభివృద్ధికి దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మున్సిపల్ ఛైర్మన్ తీగల సునీంద్ర, వైస్ ఛైర్మన్ బాదర రమేష్‌కు విశ్రాంత ఉద్యోగుల ఘన సన్మానం...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర, వైస్ చైర్మన్ బాదర రమేష్‌లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘనంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే నాగర్ కర్నూల్ మున్సిపాలిటీకి మొదటి పౌరుడిగా ఎంపిక కావడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. యువ నాయకత్వం వల్ల పట్టణ అభివృద్ధికి కొత్త దిశ దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ సమగ్రంగా అభివృద్ధి చెందాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మరింత మెరుగుపడాలని కోరుకున్నారు.మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర నాయకత్వంలో పట్టణంలోని రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, కాలువల వంటి అన్ని సమస్యలను వేగంగా పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగులు సూచించారు. అలాగే వైస్ చైర్మన్ బాదర రమేష్ సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడంతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా నాగర్ కర్నూల్‌ను తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ, యువ నాయకత్వం వల్ల ప్రజలకు చేరువైన పాలన అందుతుందని తెలిపారు. కోశాధికారి వెంకటశెట్టి మాట్లాడుతూ, మున్సిపల్ పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన సేవలు అందించాలన్నారు. మండల అధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే మరింత ఫలితాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సంజీవ్ గౌడ్, పాండు, బాలస్వామి, రాములు, నరసయ్య, నారాయణ రెడ్డి, కృష్ణయ్య, కళాధర్ శర్మ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర స్పందిస్తూ, విశ్రాంత ఉద్యోగుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రజల ఆశలను నెరవేర్చడం తన బాధ్యతగా భావిస్తున్నానని, మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. వైస్ చైర్మన్ బాదర రమేష్ మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం అవసరమని, అందరి సహకారంతో నాగర్ కర్నూల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమం సాదాసీదాగా కాకుండా హర్షాతిరేకాల మధ్య జరిగింది. విశ్రాంత ఉద్యోగులు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొని మున్సిపల్ నాయకత్వానికి తమ మద్దతును ప్రకటించారు. నాగర్ కర్నూల్ పట్టణ అభివృద్ధికి ఈ యువ నాయకత్వం కొత్త దిశలో ముందుకు తీసుకెళ్తుందనే నమ్మకంతో కార్యక్రమం ముగిసింది.

### మంథనిలో 'అరైవ్‌అలైవ్'

## రోడ్డు భద్రతా కార్యక్రమం విజయవంతం...



మంథనిరూరల్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని మంథని సీఐ రాజు సూచించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్‌అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమం 2026 భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మంథని సర్కిల్ పరిధిలోని మంథని, రామగిరి,ముత్తారం పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రైవర్లకు ప్రత్యేకంగా కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి దాదాపు 120 మంది డ్రైవర్లు హాజరై తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న డ్రైవర్లకు సీఐ రాజు స్వయంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ, రాత్రి సమయంలో లేదా పొగమంచు పరిస్థితుల్లో వాహనాలు నడిపేటప్పుడు కంటి చూపు సరిగా లేకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందుకే డ్రైవర్లు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, వేగ పరిమితులను పాటించడం వంటి నియమాలను కచ్చితంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవి కుమార్, మంథని ఎస్ఐ-2 సాగర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు.

### చలో వరంగల్' పిలుపుతో

## వైద్య కాంట్రాక్ట్ కార్మికుల భారీ ర్యాలీకి సన్నాహాలు....



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 4వ మహా సభలను పురస్కరించుకొని ఫిబ్రవరి 28న వరంగల్ నగరంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభకు సన్నాహాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో "చలో వరంగల్" పిలుపునిచ్చిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, నాగర్ కర్నూల్ జిల్లా నలుమూలల నుండి ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.శనివారం ఉదయం 10 గంటలకు వరంగల్ సికేఎం ఆసుపత్రి నుండి శ్రీ రామా కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, హక్కుల సాధన, సేవా భద్రత, వేతనాల పెంపు, రెగ్యులరైజేషన్ వంటి అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు.మారేడు శివశంకర్ మాట్లాడుతూ, వైద్య రంగంలో కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, సెలవుల హక్కులు, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల ద్వారా కార్మికుల ఐక్యతను మరింత బలోపేతం చేసి హక్కుల సాధనకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, వివిధ ఆసుపత్రుల కాంట్రాక్ట్ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ బోనాసి రామకృష్ణ...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామ నాలుగవ సెంటర్ అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ పరిశీలించారు. ఉప సర్పంచ్ గోవింద శ్రీనివాసులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అంగన్వాడి కేంద్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించిన సర్పంచ్, చిన్నారుల హాజరు శాతం, పౌష్టికాహారం పంపిణీ, గర్భిణీలు బాలింతలకు అందుతున్న పోషకాహారం వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, బరువు కొలతలు, పెరుగుదల నమోదులను కూడా పరిశీలించారు.కేంద్రం పరిశుభ్రతను ఎల్లప్పుడూ ఇలాగే నిర్వహించాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ రజియా బేగంను సర్పంచ్ ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ పరిశీలనను అభినందించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ...

### స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ....



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 27 ఆకాంక్ష : నాగర్ కర్నూల్ మండలంలోని లట్టుపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిన ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమంలో విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శిస్తూ బాధ్యతాయుతంగా ఉపాధ్యాయుల పాత్రను పోషించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య మాట్లాడుతూ, ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, భవిష్యత్తులో తమ బాధ్యతల పట్ల అవగాహనతో ముందుకు సాగేందుకు ఇది మంచి వేదిక అవుతుందని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం ద్వారా విద్యపై మరింత ఆసక్తి పెరుగుతుందని, పాఠశాల నిర్వహణలోనూ అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎం.శ్రీహరి డీఈవోగా, ఎం.నీరజ్ ఎంఈవోగా, ఎన్.అజయ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు. అదేవిధంగా మొత్తం 15 మంది విద్యార్థులు వివిధ తరగతులకు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. వారు పాఠ్యాంశాలను స్పష్టంగా వివరించడంతో పాటు సహవిద్యార్థుల సందేహాలను తీర్చారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.తదనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, నాటికలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఎం. రఘునందన్ శర్మ, గంగారం కాంప్లెక్స్ జీహెచ్‌ఎం బాలకృష్ణారెడ్డి, గౌరారం హెచ్‌ఎం వేణు, మంగనూర్ సీఆర్పీ సాంబశివులు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాయిజ్యోతి, శ్రీదేవి, సునీతలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రదర్శనకు హాజరైన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే పిల్లల్లో నాయకత్వ లక్షణాలు మరింతగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు.మొత్తానికి, లట్టుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థులలో బాధ్యతాభావం, నాయకత్వ గుణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా విజయవంతమైన కార్యక్రమంగా నిలిచింది.